


జ్ఞాన యోగం

విచారణ

మానవ విధి






సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!


స్వామి వివేకానంద

“దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం” అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఓజసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!



ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. “నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది” అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీ

కళ్యాభిలాషక కావ్యమాలిక.

విశాఖపట్టణ లండన్ మిషన్ హైస్కూలు

తెలుఁగుపండితుఁడు

మారేపల్లి రామచంద్రశాస్త్రి

వ్రాసిన

మానవవిధి.

తెలుఁగుసంధ్యావందనము.

VIZAGAPATAM.

Printed by A. Venkatareddi, at the S. S. M. Press.

1904.

మానవవిధి.

తెలుఁగు సంధ్యావందనము.

విద్యార్థులకుహితోపదేశము.

తే॥ గీ॥ మానవులుగఁ బుట్టియుఁ గూడ మానవులను
పేరు గొనఁ దగ కుండుట పేర్మి కాదు;
కాన మానవ విధి చేసి మానవుల న
నర్హు లనిపించు కొనుఁడి యో యయ్యలార !॥

ఈ 'మానవవిధి, తెలుఁగుసంధ్యావందనము' ముఖ్యముగా మీకొఱకు వ్రాయునదగుటచే మీకు నాలుగుమాటలు చెప్పవలసినవిధి నాయందున్నదిగావున వానిని నేనీక్రిందఁ బొందుపఱిచెద. మీరును శ్రద్ధతోఁజదువుఁడు. 'మానవవిధి యేమిటి? మాకు సంధ్యావందన మెందుకు? అది యక్కఱలేని యప్పుడు దానిని గూర్చి చెప్పుమాటలు చదువుటయెందుకు?' అన వచ్చెదరు కాఁబోలును. దూరముగా నాలోచింపక యట్లనరాకుఁడు. మొదట మీవిధియేదియో మీరు తెలిసికొనుఁడు. మీకు మీవిధియేదో తెలియకుండుటయే యీగ్రంథము వ్రాయుటకు ముఖ్యకారణము. మీరు బాగుపడి, యితరులను బాగుచేసి, దేశమును బాగుచేయఁ బూనుకొని పనిచేయుటయేమీవిధి. ఇది తెలిసిన మీకును సంధ్యావందనముతోఁ బని

యున్నది. అందుచే దానిఁగూర్చి చెప్పుమాటలు చదువుటకును బ
సియున్నది. అయిన మీరిట్టి మంచియుద్దేశమే లేనివారా? ఇప్పటి
కంతయుఁ గాకున్నఁ గొంతయైననుండదా? కొంతయున్నఁదక్కి
నది దైవానుగ్రహమునఁ బూర్తి కాఁగూడదా? కాన మీరు బొత్తి
గా నట్టియుద్దేశము లేనివారు కారు. కాఁబట్టియే నాశక్తి కొలఁది నే
ను మీకుఁ దోడుపడుటకుఁ బూనుకొన వలసివచ్చినది. నేను మీకుఁ
దోడ్పడునపుడు మీరుమాత్రము నాకుఁదోడుపడరా? తప్పక తో
డుపడుదురనియే నానమ్మకము. ఇంతకు మేము తోడుపడి చేయున
దియేమనియెదరేమో? వినుఁడు మఱేమియు లేదు, నేను వ్రాసి
నసంగతులను జక్కఁగాఁ జదివి, దూరముగానాలోచించి, వాని
ప్రకారము నడచుటయే. మీరిట్లు చేయనియెడల నాప్రయత్నమంత
యు బూడిదలోఁబోసిన పన్నీరేయగు. కావున మీవిధి నెఱింగి, సం
ధ్యావందనము నవలంబించి, మీరుబాగుపడి, పైవారిని బాగుచేసి,
దేశమును బాగుచేసి, మీజన్మముసఫలముచేసికొనుఁడు.

అయిన 'మేముసంధ్యావందనము చేయకపోవుటచేతఁ జెడిపో
వుచున్నామా? అక్కఱలేని బెడద, సంధ్యావందన మెందుకు?' అ
ని సందియపడువారి సంశయములఁ దీర్చుట మొదటిపని గావున
దానినిగూర్చి కొంచెము చర్చించి చూతము. ఇంతకు నిట్టిసందేహముల
కాస్పదంబగు

సంధ్యావందనమన నేమి?

సంధ్యాకాలముల భగవంతునిగూర్చి చేయువందనమని చాల
మందికిఁ దట్టకపోదు. సరియే కాని సంధ్యలేవి? ప్రాతస్సంధ్య, మ
ధ్యాహ్నసంధ్య, సాయంసంధ్యయునని మూడు. ఇందు జాగ్రత్స్వ

షుప్త్యవస్థల సంధికాలములను సంధ్యలుగా గ్రహింపవలయు. కానఁ బైనిజెప్పిన సంధ్యలయందుఁ బరమేశ్వరుంగూర్చి చేయు వందనము సంధ్యావందనము. 'అయిన నది యెందుకుఁబుట్టినది' యని కదా మీప్రశ్న. అయ్యలారా! మంచి దేదిగాని యెందుకుఁబుట్టును? మనల మంచికే పుట్టును. ఏమి యీమంచి యందురా? మఱేమి? మనల బాగుచేయుటయే. కావున మనము బాగుపడి మనజన్మము సఫలము చేసికొనుటకుఁ బరాత్పరునిగూర్చి సంధ్యలయందుఁ జేయవలసిన వందనము సంధ్యావందనము. తెలిసినదా?

మఱియొకమాట. ఈసందర్భమున నొకయంశము జ్ఞాపకము రాకమానదు. ఏమంటిరేని, సమస్తవిద్యానిధులును, సర్వజ్ఞులును, దూరదర్శులును, పరోపకార పరాయణులును, అమానుష మహిమాంచితులునగు మహర్షులు చేసిన కార్యములేవి శ్రేయస్కరములుగావు? అన్నియు శ్రేయస్కరములే. దూరముగా నాలోచింపక నవనాగరికులు కొందఱు వారిపనులలో గుణముల గ్రహింపక నలుసులేఱఁబోయెదరు! ఇంతకంటెఁ దెలివితక్కువ వేఱేయున్నదా? సర్వజ్ఞులై, సకలవేదశాస్త్రనిర్మాణదక్షులై, ప్రపంచతత్త్వము కరతలామలకంబుగావించుకొని, స్వార్థపరాయణత్వ మణుమాత్రమును లేక, లోకోపకారమే ప్రధానముగా నెంచుకొని, తమబుద్ధినంతయు వినియోగపఱిచి, పరులకై తమజీవముల ధారవోసిన యామహాత్ముల కార్యములయందు నెఱసు లెన్నుఁ, దా మెందుకుఁబుట్టినారో యను జ్ఞానమేలేక క్షుద్రజంతువులవలెఁ దిని తిరుగుచు, తుచ్ఛశరీర సుఖమే ముఖ్యముగాఁ జూచుకొనుచు, దూరాలోచనము గగనారవిందమై, తత్త్వజ్ఞానము శశశృంగమై, పరోపకారము వంధ్యాసంతానమై తాము మనుష్యులమేయనుకొను వారికెన్నిగుం

జెలుకావలయును? ఇంతకు వారి తెలివితక్కువమాటలవలనఁబోవునదియేమి? గ్రుడ్డికన్నుమూసిన నొకటియే తెఱచిన నొకటియే యని వారిని లెక్కింపక యూరకుండుటకువీలులేదు. ఊరకున్న, వారు చెడుటయేకాక మంచిచెడ్డలెఱుఁగని పిల్లవాండ్రఁగూడఁ జెఱుతురు. కాననీసంగతి యెత్తుకొనవలసివచ్చినది. సిరియంటదుగాని చీడయంటునను సామెతవిన్నారుగదా. అట్లె మంచి వేగముగాఁ బట్టుపడదుగాని చెడ్డ పట్టుపడును. కాఁబట్టి చీడయంటుకొనకుండుటకు మెలఁకువగలిగియుండుఁడు. అంటిన వదలుట దుష్కరము.

ఇపుడు మనత్రోవకడ్డముగావచ్చిన ముండ్లకంచె తీసివేసినారముకావున నికఁ దిన్నఁగాఁబోవచ్చును. మహాత్ములగు మహర్షులు చేసినవన్నియు శ్రేయస్కరములే. అందుచే నన్నియు శ్లాఘనీయములే. వానిలో సంధ్యావందనము వారి బుద్ధివైభవమంతయు నుపయోగించి చేసినదగుటచేతను, అనుభవములోనికిఁదీసికొనరాఁదగినదగుటచేతను, ఎప్పటికప్పుడు మేలుకలిగించునదగుటచేతను, అందుచేనొకనిజన్మము సార్థకముచేసి, యితరులజన్మము సార్థకము చేయించి, దేశాభివృద్ధిచేయునదగుటచేతను నామతమున నన్నిటిలోపల శ్రేయస్కరము, శ్లాఘనీయము.

అయిన, మీరు, ‘ ఇదంతయు సరియే కాని సంధ్యావందనమును మహర్షులను బొగడుటయే కనఁబడునుగాని మాకుఁగావలసిన సంగతి తేలలేదు’ అనియెదరాయేమి? మీకుఁగావలసిన సంగతియేమి? సంధ్యావందనమువలనఁ గలుగు మేలు మనల బాగుచేయుటయేయని చెప్పియుంటినిగదా. ఏమి? యింకను సందేహము బాధించుచున్నట్లు కన్పించుచున్నది.

అది మనల బాగుచేయుటయెట్లు?

అనికదా మీసందియము. మంచిది. వినుఁడు. సంధ్యావందనము మనల నెట్లు బాగుచేయునో యనుసంగతి తేలుటకుముందు, బాగుచేయుటయన నేమో మనకుఁ దెలియవలయును. దీనికొక యుదాహరణము తీసికొందము. పొలము బాగుచేయుటయన నేమి? బాగుచేయుటకు సేద్యగాండ్రేమి చేయుదురు? పొలము బాగుచేయఁబూనుకొనిన సేద్యగాండ్రు మొదట దానియందుఁగల ముండ్లచెట్లు మొదలగునవి కొట్టివేసి, మెఱకపల్లములు సమముచేసి, గెత్తము వేసి దానిని సారవంతముగాఁ జేయుదురు. ఇదియేకదా పొలము బాగుచేయుట. దీనినిబట్టి సంధ్యావందనము మనలను బాగుచేయుననఁగా నేమనవలెను? 'అది మనయందుఁగల చెడుగుణములను నిర్మూలము చేసి, మంచిగుణము లబ్బునట్లు చేసి, బాగుచేసిన పొలము పైరులఁబండింపఁ గలుగునదగునట్లు మనము మంచిపనులు చేయఁగలుగుటకుఁదగినస్థితిలోనికిఁ దెచ్చుటయే,' అయియుండవలయునందురుగాని 'ఎట్లు' అను ప్రశ్నమాత్రము వదలరు. తొందరపడకుఁడు. క్రిందనున్నవారు మేడపైనున్న వస్తువుల నొక్కసారి యెగిరిచూడవలయుననిన వీలుపడునా? ఎంత వేగముగానయినను మెట్లన్నియు నొక్కొక్కటి యెక్కవలయును. అట్లేయిదియు. మొదట, సంధ్యావందనము మనచెడుగుణముల నెట్లు పోఁగొట్టుననునదియె తెలియవలసినయంశము. ఆలకింపుఁడు. దానివలన మనము ప్రతిపగలును, ప్రతిరాత్రియు మనయింద్రియములచేఁ జేయుపాపములనన్నిటిని దలఁచుకొని, చేసినందులకు మనస్సున వగచి, వానివలనఁగలుగు పాపము తొలఁగింపవలయునని భగవంతుని వేఁడుకొని, అట్టిపాపములు మ

అలఁజేయఁగూడదను నిర్ధారణముచేసికొనుట తటస్థించును. చూచితిరా? దీనియందెంత మేలున్నదో! మనముచేయుపాపములు నశించుటకును, ఆపాపములుచేయుటకుఁ గారణములగు చెడుగుణములు తొలఁగుటకును నిజమగు పశ్చాత్తాపముకంటె నుత్తమసాధనమేది? అట్టిపశ్చాత్తాపము ననుదినమును బలుసారులు గలిగించునది సంధ్యావందనముగాక మఱియేది? అట్టిచోనదియే చెడుగుణముల నిర్మూలముచేయం గలదనుటకు నడ్డేమి?

అయ్యలారా! కంటిరా సంధ్యావందనప్రభావము? తెలిసికొంటిరా యదిచెడుగుణముల నిర్మూలముచేయువిధము? మూడువంతుల ముప్పాతికదాని మహిమయిందులోనేయున్నది. ఇట్టిదూరదృష్టితో మొదట నీసంధ్యావందనము నేర్పఱిచిన మహాత్ముల బుద్ధివిశేషము రవంతయైన మన మెన్నఁగలమా? కృతజ్ఞతాపూర్వకముగ వందనములాచరించుటకంటె మనము వారిఋణము మఱియొక విధమునఁ దీర్చుకొనఁగలమా? వట్టిది. అయిన నీయంశమునసే సంధ్యావందనమును, దాని నేర్పఱిచినవారి నింతగా మెచ్చుకొననేలయందురేమో? అట్లనకుఁడు. ఇదియే యన్నిటిలో మిన్నగా నెన్నఁదగినయంశము. ముండ్లచెట్లుకొట్టి మంటఁబెట్టక పొలమునఁ బెంటకట్టుటకుఁగాని, పైరు వేయుటకుఁగాని వీలుపడునా? కోట తలుపులు విడఁగొట్టకదానిలోఁ జొచ్చుటకుఁగాని, స్వాధీన పఱుచుకొనుటకుఁగాని శక్యమగునా? కోఱలూడఁబెఱుకక పామును లోఁబఱుచుకొనఁగాని, నిర్భయముగా నుండఁగాని వలనుపడునా? అట్లేసాధింపరానివై, తరువాతిపనులకెల్లనడ్డై, మనలఁ బాడుచేసి,యితరులఁ బాడుచేయించి, దేశాభివృద్ధికిఁ బెద్దమారియై

యుండు దుర్గుణసమూహమును నిర్మూలముచేయఁగలదానిని, దానిని మానవులకుఁ బెన్నిధానముగా నొసంగిన వారినిఁగొనియాడి సంతసించుటకంటె మేలుగోరువారి కెక్కుడగు నంశము మఱియొకటిలేదని నొక్కి వక్కాణింపవచ్చును.

ఇఁక, 'సంధ్యావందనమువలనఁ గలుగు సుగుణములేవి?' అందురుకాఁబోలును. ఇవియవి యననేల? అది దుర్గుణములనన్నిటినెటుల నాశనముచేయునో సుగుణములనన్నిటి నట్లే వృద్ధిపొందించును. చెడుగుణములు నశించినవెనుక వానికి విరుద్ధములగు మంచిగుణములు క్రమముగా నంకురించి పెరుఁగును. ఇది వింతగాఁదోఁచునాయేమి? వింతయక్కఱలేదు. ముండ్లచెట్లు పెరిఁగి నశించినపిమ్మటఁ బండ్లచెట్లు పుట్టి, పెరిఁగి, పండుటలేదా? ఇదియునట్లే.

ఇప్పుడుదుర్గుణములేవియో, సద్గుణములేవియో కొంతవఱకుఁ దెలియుటమంచిది. ముండ్లచెట్లకును, పండ్లచెట్లకును భూలమెట్లాధారమో, చెడుగొనములకును, మంచి గొనములకును మనసు నట్లే యాధారము.

దుర్గుణములేవి?

ఒకవిధమగు వస్తువు మఱియొకవిధముగా నుండునట్లు తోపించు మోహమును, ఇతరులబాధ చేయు మనోవికారమగు కోపమును, తనదనుకొనువస్తువు నన్యులకీయనట్లుచేయు లోభమును, సుఖాతిశయంబుచే మంచిచెడ్డల నెఱుంగఁజాలనట్లు చేయు మదమును, పైవారిమేలుచూచి యోర్వనటులచేయు మత్సరమును, ఇంద్రియసుఖములను గోరునట్లుచేయు కామమును, అంతయు నాశక్తివలననే యగుచున్నదని కొనునట్లుచేయు నహంకారమును,

పరులు తన్ను మెచ్చుకొనుటకే ధర్మముచేయించుదంభమును, గుణములను దోషములుగాఁ జెప్పించునసూయయు, తానే యందఱికంటె గొప్పవాఁడనిపించు నభిమానమును, తనది కాని వస్తువు దనదను కొనునటుల చేయుమమకారము మొదలగునవి దుర్గుణములు. వీనిలోఁ గామ క్రోధ లోభ మోహ మద మత్సరముల నరిషడ్వర్గమనియు, అంత శ్శత్రువులనియుఁ జెప్పుదురుగాని నేను వీని శత్రుసేనానాయకులనియెద. వీరిలోఁ గాముఁడు పెద్ద. వీరిమాటయెందుకు? వీరియాధిపత్యముక్రింద నుండు నితరదుర్గుణభటులుమాత్రము సామాన్యులా? ఒక్కొక్కఁడు లోకము నెల్ల వ్యాకులఁబెట్టఁజాలు! ఇఁక వారి సేనానాయకులఁ గెలుచుట సుకరమో దుష్కరమో మీరే యూహించుకొనుఁడు. వీరిలోఁ బ్రతివానికి దురభ్యాస సమూహమను పెద్దబలఁగముకూడఁ గలదు. ఇట్టి సేనను, సేనాధిపతులను బేరు నూరు లేకుండ నేలఁగలుపు మహిమ సాధారణమైనదనఁగలరా? అనఁజాలరు. ఇట్టిమహిమ దేనియందున్నది? సంధ్యావందనమునఁ గాక మఱి దేనియందున్నది? అయ్యాలారా! దుర్గుణ విజృంభణమును, సంధ్యావందన మాహాత్మ్యము నిట్టివని యిప్పుడైనఁ బొడకట్టినదా?

సరియె. ఇఁక,

సుగుణములేవి?

మంచిచెడ్డలను దెలుపు వివేకమును, ఉన్నదియు- ప్రాణులకు మేలుకలిగించునదియునగు సత్యమును, మనస్సును- మాటను- పనిని నొక్కరీతిగానుంచు నార్జవమును, పైవారి సుఖదుఃఖములు తన సుఖదుఃఖములుగాఁ దలఁచునట్లు చేయుసమత్వమును, జంతువు

లదుఃఖమును సహింపఁజాలునట్లు చేయు దయయు, దొరకినదాని తోఁ దనివినొందించు సంతుష్టియు, తనకుఁగలది పైవారికిప్పించు దానమును, కీడుగలిగించు పనులపై మనస్సును బోవకుండునటుల చేయు శమమును, చెడుపనులయందు బాహ్యేంద్రియములఁ దగు లకుండునట్లు చేయుదమమును, చేయరాని పనులు చేయకుండ వెనుకదీయించు లజ్జయును, గొప్పచిక్కులు ఘటిల్లినపుడు చేయవలసినపనులఁ జేయించు ధైర్యమును, పరులు తన్ను బాధించినను సహించునట్లొనరించు క్షమయును, మేలుగలిగించు కార్యములం గావించుచో నిలకడగలిగించు స్థైర్యమును, బీదసాములదగ్గఱకుఁ జేరునట్లు చేయుమార్దవమును, ఎప్పుడును సుఖదుఃఖములఁ గలిగించు నింద్రియముల మీఁదియాసక్తి మాన్పు వైరాగ్యమును, కామక్రోధాది దుర్గుణముల మనస్సునఁ జేరనీని సత్వము మొదలగునవి సుగుణములు. అయిన సంధ్యావందనమువలన లభించు సుగుణము లివియేనా? కావు. సాధారణముగా సుగుణములని యెన్నఁబడు నివియేకాక, వీనికెల్లఁ దల్లి వేరగు దైవభక్తియు, సమస్తజ్ఞానంబున కాస్పదంబగు గురుభక్తియు, సర్వశ్రేయంబులకు మూలంబగు పితృభక్తియు మొదలగునవి గూడఁ గలుగు. చూచితిరా?

సంధ్యావందనమహిమ.

అది దుర్గుణములను ముండ్లచెట్లను గొట్టివేసి, వానిముండ్లెచ్చటనైనఁ దలసూపిన నేఱి కాల్చి పొడిచేసి, మిగిలిన వేళ్లెప్పుడైన మఱల మొలకెత్తినఁ గలుపుదీసి, తాను వేసిన సుగుణములను పండ్లచెట్లను పెన నభివృద్ధి పొందునటుల చేసి, మనస్సను పొలమును బాగుచేసి, ఫలింపఁజేసి మనకులాభ మొనరింపఁ జూచు. ఇట్టి సం

ధ్యావందనపుఁగాపును దిరస్కరించుట న్యాయమా? దూరముగా నాలోచింపక పెద్దబింకములు పలుకుచుఁ దెలివితక్కువపనులు చేయుటకు వీలగుబలమునిచ్చి శరీరమును బోషించు ముద్ద ముందు నకు వచ్చుటకు సంవత్సరమంతయుఁ గష్టపడు కాపునే మనము లెక్కసేయ నప్పుడిఁక సంధ్యావందనపుఁ గాపును లెక్కసేయుదుమా యందు రాయేమి? అనరు. ఇదిపఱకుఁ దెలియక యాసిననిప్పుడ నఁజాలరు. ఇప్పుడుననఁజాలిన వారి కేమియు నేనికఁ జెప్పఁజాలం. నిజమునకుఁబోలము కాపును, సంధ్యావందనపుఁ గాపునుగూడ మన్నింపఁబడవలసినవారే. అందులో మొదటికాపును మన్నింపవల యునని నేర్పు నాఁడగుటచే రెండవకాపెక్కువగా మన్నింపఁదగినవాఁడు. ఇప్పుడేమనెదరు? ఇంకను 'సంధ్యావందనము చేయకపోవుటచే నేము చెడిపోవుచున్నామా?' యని ప్రశ్న వేయఁగలరా? వేయలేరు. సంధ్యావందనము చేయకపోవుటచే నిశ్చయముగాఁ జెడిపోవుచున్నారు. ముక్కాటికిఁ జెడిపోవుచున్నారు. ఇప్పటికే మీకది మనస్సునఁ దట్టకతప్పదు. ఒప్పుకొనకతప్పదు.

లోకములో మంచివారని ప్రసిద్ధినొందినవారందఱు దాని న వలంబించిన వారే. సంధ్యావందనావలంబనము లేక పరిశుద్ధులమగుదుమనుట, నేలలేక నిలుతుమనుట, నీరులేక కడుగుదుమనుట, అగ్ని లేక వండుదుమనుట, వాయువులేక బ్రతుకుదుమనుట, ఆకాశము లేక పోదుమనుట. అదియునుగాక లోపలిగుట్టు పెరవాళ్ల కెఱుకయగునటుల తనగుట్టు తనకుఁ దెలిసినట్లు మఱియొకరికిఁ దెలియదుగాన బాగుపడఁదలఁచినవాఁడు తనలోఁదానె పరిశుద్ధత నొందవలయును. అట్టిపరిశుద్ధత సంధ్యావందన విధానంబునఁ గా

క్షతియొకదానివలనఁ గలుగదు. కావున నదియె మనుష్యులకొఱంతలేకుండ బాగుచేయు సాధనము.

ఏమి? ఇంకను "మేము సంధ్యావందనము చేయకపోవుటచేత నేమియుఁ జెడి పోవుటలేదు; సుఖముగా నున్నాము; అక్కఱలేనిబెడద; ఇదిమాకెందుకు?" అనఁగల మహానుభావులు కొందఱున్నారాయేమి? ఉన్నట్టివారికొకమాట.

అయ్యలారా! దూరముగా నాలోచించుకొనుఁడు. క్షుద్ర జంతువులవలెఁ దిని తిరిగి, యెవరికిఁ బనికిరాక, తాము పాడయి, మీఁదుమిక్కిలి యితరులను బాధచేసి, లోకమున కపకారముచేసి శత్రువులయి, చచ్చిరేని పీడవదలునని యనిపించుకొని చచ్చుటకా భగవంతుఁడు మనుజులసృజించినాఁడు? కాదు. కావున దూరాలోచనములేక చెడిపోకుఁడు. మీకుఁ దెలియకున్నఁ దెలిసినవారు చెప్పినమాటవినుఁడు. మంచిత్రోవకు రండు. మీవిధిని మీరు తెలిసికొనుఁడు. సంధ్యావందనము నవలంబింపుఁడు. ఈశ్వర సన్నిధానమునకుఁ జేరుఁడు. 'అయిననిప్పటిమాత్రోవ మంచిదికాదా?' అందురా? నిజముచెప్పుమందురా?

ఇప్పటి మీత్రోవ యడవిత్రోవ.

మొదటనే యింపుగానుండుఁగాని కొంతదూరము పోయినంత నేమాయమగును. అటుగాకున్నఁ బెక్కుత్రోవలుగాఁ గనిపించు. కాన నదియొకత్రోవ కాదు. అది మిమ్ము నట్టడవిలోనికిం గొనిపోయి బయటికి రాఁదలఁచుకొన్నను రాఁజాలనట్లుచేసి చిక్కులం బెట్టునది కాని యొకదరిచేర్చి సుఖపెట్టునది కాదు. ఇఁక 'దూరముగాఁబోము, త్రోవ మొదటనేయుండి సుఖించు వారమంటిరేని

యదియును మీయిష్టానుసారముగా జరుగునది కాదు. మీరు సాయం
కాలపు విహారముగా బయలుదేఱినారు. ఇక్కడక్కడకను నిర్ణ
యము లేక యీత్రోవను బడినారు. అడవిదగ్గఱకుఁ జేరినారు.
సూర్యాస్తమయపు వేళయగుటచే నిది యందముగానున్నది. కా
ని యీయందమెంతసేపు? మీసంతోషమెంతసేపు? క్షణము. చీఁ
కటికమ్మెను. అడవిమెకములయార్పులువినవచ్చు; హెచ్చు. మీగుం
డెలు బితుకుబితుకులాడు. కలవరపడుదురు. కాళ్లుద్రొక్కుకొందు
రు. ఈసంక్షోభములో నేమృగమువచ్చిమీఁదఁబడునో, యేదినోట
వేసికొనిపోవునో చెప్పవీలులేదు. మీరుబయలుదేఱిననాఁడు చీఁక
టిరాత్రి కాక వెన్నెలరాత్రియందురేమో! అట్లె యనుకొందము.
అయినదానిఫలమేమి? అడవిమెకముల భయముతప్పునా? దానిం
బట్టి యొకదానివెంబడి నొకటివచ్చు చిక్కులుతప్పునా? పోనిం
డు. అవియేవియు రావనుకొందము. అంతతోనయినదా? మీరు కృ
తార్థులయినారా? ఏమిటిమీకృతార్థత? ఆసులోని పోఁగులచంద
మున నొకచోటనే చుట్టుఁజుట్టుఁ దిరుగుచుండుటయేకదా? ఇదియే
కదా మీకు మీత్రోవయిచ్చుఫలము? వెఱ్ఱివారలారా! దూరాలో
చనము లేక మీగోతులు మీరే తీసికొనకుఁడు. ఇప్పటికిని మీత్రో
వ మంచిదియే యనఁగలరా? అదిచక్కెరపొదిగిన విషమాత్ర. ము
సిఁడిపండు. ఎఱగ్రుచ్చినగాలము. నోరూరఁజేయుబోను. తెలిసిన
దా? వల్లుఁడు. మంచిదారికిరండు. ఇంకను మేము పట్టినకుందే
టికి మూడేకాళ్లనితమచెడుదారి విడువకున్నవారున్న, వారికర్మ
ము. ఎవరేమిచేయఁగలరు? ముక్కుపట్టింపఁ గలముగాని నారా
యణాయని యనిపింపఁ గలమా యనునటుల మంచి యిదియ
ని చూపవచ్చునుగాని మొండికెత్తి యీదారిఁబట్టుమనినఁ జేయున

దిమేమి? ఎంతచెప్పినను దమమంచి తాము తెలిసికొనని వారిగతి 'ఏమి? సాయిబాబూ! చిక్కిపోవుచున్నావు' అనఁగోపించి 'చిక్కిపోయెదము, ఇంకను జిక్కిపోయెదము, చచ్చెదము, నీకెందుకు' అని జవాబుచెప్పు సాయిబాబుగారి గతియే. కావునఁ దెలివితక్కువమాటలును, తెలివితక్కువపనులును, తెలివితక్కువపట్టులును గట్టిపెట్టి మంచిదారికి రండు. బాగుపడుఁడు. మీజన్మముసార్థకము చేసికొనుఁడు.

ఇది పండ్లతోఁటదారి.

ఇరుప్రక్కలఁ గంచెయుండుటచే మొదట బాగుగ ముండ్లపోట్లు తగులవచ్చునుగాని తరువాతి ఫలమో? కావలసినన్నిపండ్లు దొరకును. ఎప్పుడైనను మృగబాధలేదు. ఎటువెళ్లినను దారియే. ఎటువెళ్లినను ఫలములే. ఒకవేళమీరు, నాలుగుకాళ్ల మెకముల బాధలేకున్నను రెండుకాళ్ల మెకముల బాధయుండునందు రేమో! అదినిజమే. ఆబాధకొంతవఱకుండునుగాని ప్రాణముతీయునది గాదు కావున నంతగా భయపడనక్కఱలేదు. మనము మ్రింగరాని మెతుకులవలె నిబ్బరముగానుండి న్యాయముగా నడుచుకొనుచున్న నీవింత మెకముల గొంతుకఁబడఁ దామేయుక్కిరిబిక్కిరియయి తమతప్పిదము దాము తెలిసికొని బుద్ధితెచ్చుకొని తమమానుషత్వమును బొంది తిన్ననిదారికివచ్చునుగావున నీరెండుకాళ్ల మెకములనుగూర్చియు సందేహింపఁబనిలేదు. అదియునుగాక యితరులకును మనకును శాశ్వతసుఖము కలిగించుబాధ యొకబాధ కాదుగదా?

ఇఁక నెటువెళ్లినను దారియే యనుటచే నిదియు నొకదారి

కాదని చెప్పవచ్చెదరేమో! అదివట్టిభ్రమ. అడవిత్రోవవలె నెక్కడకో తీసికొనివెళ్లి యాకస్మికముగా మాయమగునది కాక ఫలమునిచ్చు స్థలమునకే కొనిపోయి మరల మొదట దారికిఁ దెచ్చునది కావున నిది పైదానివంటి దెంతమాత్రము కాదు. పండ్లుదొరకినను ముండ్లను గ్రుచ్చుకొను చుండునేమో యనిన నవి కావలసినవే యనెద. ఇదిమఱియు బాగుగ నున్నదందురు కాఁబోలును. తొందరపడి నాలుకచివరకు వచ్చిన ప్రతిమాటయునని, తోఁచిన ప్రతిపనియుఁ జేసి నగుపాట్లపాలుగాకుఁడు. మీగౌరవము మీరే చెఱుపుకొనకుఁడు. మీదూరాలోచనము లేమియే మిమ్మింతకుఁ దెచ్చుచున్నది. ముండ్లక్కఱలేకయే మీకుఁ బండ్లు కావలయునా? కష్టములక్కఱలేకయే సుఖములు కావలయునా? ముండ్లుముందా? పండ్లుముందా? కష్టములుముందా? సుఖములుముందా? కష్టపడక ఫలముగలుగునా? దున్ని పైరుపెట్టక పొలము పండునా? చదివి వ్రాయక పరీక్షయగునా? ధాన్యము దంచి వండక యన్నము సిద్ధముగునా? కావున సుఖములకుఁ గష్టములు కావలె. కష్టములు లేనిచో సుఖములు రుచింపవు. కష్టములులేనిచో సుఖములు సుఖములు కావు. ఇందులకొక యుదాహరణము- లడ్డు, జిలేబి, హల్వా మొదలగు తీపివస్తువులు వడలు, పకోడీలు మొదలగు కారపువస్తువుల తోడులేక ప్రత్యేకముగా మీరు దినఁగలరా? తిందమనుకొందము. తినినఁగొంతసేపటికవి మొగము మొత్తించి రుచి చెఱుపవా? రుచి చెడినవెనుకఁ దినకున్న నెంతఫలమో తినిన నంతే ఫలము. చూచితిరా? యీక్షుద్రసుఖములస్థితియే యిట్లున్నప్పుడిఁకఁ గష్టములులేనిచో నిజమగుసుఖములు సంతోషదాయకములగునా? కాకపోయిన నవి సుఖములనిపించుకొనునా? కావునఁ బండ్లుగోరువా

రు ముండ్లకు జడియఁగూడదు. సుఖములుగోరువారు కష్టములకు జడియఁగూడదు. జడిసిన సుఖములురావు. కావున వెఱ్ఱిమాటలు చెప్పరాక దయాకరుండగు పరమేశ్వరుండిచ్చిన వివేకపుఁగన్నువిప్పి మంచిచెడ్డల దూరముగాఁ జూడుఁడు. చెడ్డదారిఁబడక మంచి దారిఁ బట్టుఁడు. దేవునికిఁ బ్రియులగుఁడు.

ఎందుకుఁగొందఱు నవ్వెదరు? దేవుఁడున్నాఁడా యనియా?

ఏమి! దేవుఁడే లేఁడా?

మూర్ఖులారా! దేవుఁడు లేనియెడల మీరును లేరు. ఏమి? మొగము చిట్లించి కనువెఱ్ఱిచేసెదరు. మొగము చిట్లించి కనువెఱ్ఱి చేయవలయునా? వాఁటియనైనఁజేయవలయునా? మేముండఁగ లేరనియెదవేమి? అనెదరు కాఁబోలును. సరియే కాని దేవుఁడు లేడనినంతలకు మిమ్ము నట్లే యనవలసియుండునేమో! దానికి మేము కనఁబడుచున్నాము, దేవుఁడు కనఁబడుట లేదందురా యేమి? ఇంతకు 'కనఁబడుట' యననర్థమేమి? కంటికిఁ దెలియుట- కంటఁబడుటయేనా? అట్లయిన మీకంటఁబడని ప్రతివస్తువు లేదందురు కాఁబోలును. మీరుచూడని పరదేశమందున్న మనుష్యులందఱు లేరందురా? ఉన్నారని విన్నాము గాన నట్లనందురు. ఎక్కడనో యున్నవారిమాట యెందుకు? అంతటనుండుగాలి మీకంటఁబడుచున్నదా? మీకంటఁబడుటలేదని యది లేదందురా? అది మాచర్మమునకుఁ దాఁకుచున్నది గాన లేదననందురు. అట్లయిన దీనినిబట్టి యింద్రియములలో దేనికిఁగాని తెలిసినవస్తువున్నట్లె మీరొప్పుకొందురా? దానికేమైన సందేహమున్నదా? ఏమియు సందేహము లేదందురు.

అయిన మనస్సను నొక యింద్రియమున్నదని మీకుఁ దెలియునా? తెలిసినట్లే యని యనవలయు. అయిన మీమనస్సునకెప్పుఁడుగాని దేవుఁడున్నాఁడని తట్టలేదా? లేదని నిస్సందేహముగాఁ జెప్పవత్తురు. సరియె కాని, సుఖములయందుఁగాదు; దుఃఖముల యందు? లేదన సాహసింతురా? దైవమా! దేవుఁడా! భగవంతుఁడా! అను ముక్కలు మీనోట నెప్పుడు రాలేదా? రాలేదను కొందము. పాడుదేవుఁడు నన్నిట్టిబాధ పెట్టుచున్నాఁడనుకొనలేదా? పైకట్లనకపోయిన మనస్సునకుఁ దట్టలేదా? దేవుఁడున్నాఁడనిగాని, దేవుఁడాకష్టములు మాకుఁ గలిగించుచున్నాఁడనిగాని, అట్టి కష్టములఁ దొలఁగింప దేవునికి మొఱపెట్టవలయుననికాని మీ మనస్సునకుఁ దట్టలేదనుకొందము. మీరు నెఱవేఱుననుకొనినపని నెఱవేఱనప్పుడుగాని, నెఱవేఱదనుకొనినపని నెఱవేఱినప్పుడుగాని, తలఁపని తలంపుగా నొక సుఖమైనను గష్టమైనను వచ్చినప్పుడుగాని మీకుఁ దెలియరాక మీశక్తికంటె మించినశక్తి యొకటియుండి యట్టి కార్యములు జరిగించుచున్నదనినైన మీమనస్సునకొకప్పుడుగాకపోయిన నొకప్పుడైనఁ దట్టినదా? లేదా? తట్టియుండవలె. మీకుఁ దెలియరాక యన్నిపనులను జేయు శక్తియే సర్వశక్తి. ఆసర్వశక్తియే దేవుఁడు, భగవంతుఁడు, పరాత్పరుఁడు, పరమేశ్వరుఁడు.

ఇట్లు తట్టనివారికి మనస్సను నింద్రియమే లేకపోవలెను. కాని మనుష్యులకు మనస్సుండకపోదు. ఉండిన నాసంగతి తట్టక మానదు. అయిన, మనస్సుండిన యెడల నది గ్రహింపవలసిన యంశము కొంచెముగూడ గ్రహింపలేకపోవుటయెట్లు? అని యాశ్చర్యపడుదురేమో. అక్కఱలేదు. కన్నుండియుఁ బొరగమ్మినపుడు

చూడఁగలుగునా? అట్లైన మనస్సును మోహాములచేఁ గప్పఁబడినపుడు పరాత్పరుఁ గనఁజాలకపోవు. అట్టివారికిఁ దోడ్పడుట మనకు విధిగావున దేవుఁడుగలఁడను నమ్మకముగలవారు మనకాలము వ్యర్థముగాఁ బోవుచున్నదని తొందరపడకుఁడు. మనమే లేమనము చూచుకొనుట గొప్పగాదు. పైవారిమేలు ముఖ్యముగాఁ జూడవలయు. కావునఁ గొంచెము తాళుఁడు. మనుష్యుల మనుకొనియు దేవుఁడు లేఁడని తెలివితక్కువపనులుచేసి చెడిపోవు నీ తెలివితక్కువాండ్రకు మఱికొంచెము బోధించి మంచిదారిలోనికిఁ దీసికొనిరాఁ బ్రయత్నింతము.

అయ్యలారా! మనమిప్పుడు దేనినిగూర్చి చర్చించుచున్నాము? దేవుని యునికింగూర్చి. దేవుని యునికింగూర్చియా? మంచిదే కాని మీరు దేవుఁడు లేఁడనువారుగదా? దేవునిగూర్చియని యెట్లు చెప్పినారు? వస్తువున్నప్పుడుగదా పేరువచ్చును. వస్తువులేని పేరుండునా? ఉండదు. కాఁబట్టి మనమున్న వస్తువును గూర్చియే చర్చించుచున్నాము గాని లేని వస్తువునుగూర్చి చర్చించుటలేదు. అందువలన దేవుఁడున్నాఁడు. మీరున్న వస్తువు లేదని వాదించుచున్నారు. ఏమనియెదరు? ఇప్పుడైన దేవుఁడున్నాఁడని యొప్పుకొనియెదరా? ఒప్పుకొనరా? ఏమి యాలోచించుచున్నారు? మేము మీరున్నదని చెప్పిన వస్తువు లేదని వాదించుచున్నాముగాని మేమున్నదని చెప్పిన వస్తువు లేదని వాదించుటలేదు కావున మా వాదమునకు బాధకములేదందురు కాఁబోలు. ఆఁ! మీరేమి తెలివితక్కువవారా? అయిన నేనొకఁడనే కాఁబోలును దేవుఁడున్నాఁడని చెప్పువాఁడను? కాకున్న నేమి? అనేకులున్నారనుకొందము. దానివలన మాకు బాధయేమందురు. పోనిండు. మఱియొకమాట. దేవుఁడున్నాఁడను

వారిప్పుడు క్రొత్తగా బయలుదేఱినారందురా? పూర్వముఁ గూడ నున్నారందురా? పూర్వముమాత్రమున్న నేమందురా? యేమి? మీరేమైన ననఁగలవారే. అయినఁ బెక్కు వేలేండ్ల క్రిందటనే దేవుఁడున్నాఁడని తెలిసికొనినవారును, అప్పటినుండియు నాప్రకారముగా నమ్మినవారును, ఇప్పుడు నమ్మువారు నందఱును మీకంటెఁ దెలివితక్కువ వాండ్రును, మీరే తెలివికలవారు ననియా మీయభిప్రాయము? ఊరియందఱది యొకదారి యులిపికట్టెది మఱి యొకదారియనునట్లు నడిచి చెడిపోకుఁడు. దూరముగా నాలోచింప లేకపోవుటచే దేవుఁడున్నాఁడను సంగతి మీకుఁ దట్టకున్నఁ దట్టలేదనుఁడుగాని దేవుఁడు లేఁడని మొండివాదము చేయకుఁడు. తప్పు. పూర్వము మనమహర్షు లెంతకాలమో తమబుద్ధినంతయు వినియోగపఱిచి యాలోచించియే దేవుఁడున్నాఁడని నిశ్చయించినారు. పైదేశములయందును బుద్ధిమంతు లట్లె నిశ్చయించినారు. అందుచేతనే యిప్పుడు లోకములో నేరూపుననో దేవుఁడు కలఁడనువారే లేఁడనువారికంటె నెన్నిరెట్లో యెక్కువగా నున్నారు. కావున నింతమందియున్నదను వస్తువు మీరు లేదనుట వెఱ్ఱిగాని మఱియొకటి కాదు.

గ్రుడ్డివాఁడు తానుజూడఁజాలని రంగు లేదనఁగలఁడా? చెవిటివాఁడు తానువినఁజాలని ధ్వని లేదనఁగలఁడా? ముక్కుఁడి వాసన లేదనఁగలఁడా? జ్వరరోగి రుచి లేదనఁగలఁడా? తిమ్మిరిపట్టినవాఁడు వేఁడిమి లేదనఁగలఁడా? అనఁజాలఁడుగాని యనవచ్చును. అనినఁ బైవారేమి చేయుదురు? నవ్వుదురు; కనికరింతురు; ఉన్నసంగతి చెప్పుదురు. ఇందువలనఁ దేలినదేమి? ఆయాగుణములను దెలిసికొనలేకపోవుటకుఁ గారణము వారివారికిఁ గలలోపముగాని గు

ణము లేకపోవుట కాదు. అట్లై మీరు దేవుఁడున్నాఁడని తెలిసికొనలేకపోవుటకుఁ గారణము మీకుఁ దగిన తెలివి లేకపోవుట గాని దేవుఁడు లేకపోవుట కాదు. ఏమి? మాకుఁ దెలివి లేదాయని దెబ్బలాటకు వచ్చెదరా యేమి? తాళుఁడు. మీకుఁ బొత్తిగాఁ దెలివి లేదనలేను. తెలివి యున్నది గాని తగినది గాదు. మీరు తగినట్లు చేసికొనవలె. పోలికగల రంగుల భేదము తెలిసికొనుటకుఁ గంటికి మంచి యలవాటు కావలె. పోలికగల వాసనలలో భేదము తెలిసికొనుటకు ముక్కునకు మంచి యలవాటు కావలె. పోలికగల ధ్వనుల భేదము తెలిసికొనుటకుఁ జెవికి మంచి యలవాటు కావలె. అయిననందఱికన్నులు, ముక్కులు, చెవులు నొక్క విధముగా నుండవు. కొందఱాయా భేదములు సులభముగా గ్రహింపఁగలరు. కొందఱు కష్టముమీఁద గ్రహింపఁగలరు. కొందఱు గ్రహింపనేచాలరు. కొందఱాయా యింద్రియముల శక్తి, జబ్బువలనఁ గాని మఱియొక యడ్డువలనఁ గాని తగ్గిపోవుటచే గ్రహింపఁజాలరు. కొందఱు గ్రహింపఁగలిగియు గ్రహించుటకుఁ బ్రయత్నింపరు.

మీరు బొత్తిగా గ్రహింపఁజాలనివారును గ్రహింపఁగలిగియు గ్రహింపఁ బ్రయత్నింపనని మొండియెత్తెత్తినవారును గానియెడల మఱియొక మాట వినుఁడు. ఎప్పుడైనఁ జెడుపని యేదైనఁ జేయుటకుఁ దలఁచినప్పుడు ప్రతివానికి మనస్సులోపల నిది కూడును గూడదను సంవాదము జరుగుట మీకుఁ దెలియునా? ఒకవేళ నంతగా సంవాదము జరుగకపోయినను 'నీవు చేయుపని మంచిది కాదు; చేయవలదు' అని యెవరో మీకు బోధించినటులయినను దట్టలేదా? మీరు బుద్ధిగలవారైనయెడల నిట్టిపని జరిగినటుల తట్టకమానదు. తట్టినను మీరు మొండికెత్తి దానిని లక్ష్యము చేయకపోవచ్చును. ల

త్యము చేయకపోవుట మంచిదికాకపోయిన నది వేఱేమాట. ఏమి? ఏమనియెదరు? సందేహింపక నిజముచెప్పుఁడు. నిజముచెప్పుట తప్పుకాదు. చెప్పరేమనిన నటుల తట్టినేమి యనవలయును గాని మీకు మఱియొకదారిలేదు. మఱియేమియులేదుగాని యటుల మీకుబోధించువారెవరు? మీరుచెప్పఁజాలరా? చెప్పరా? మీరుచెప్పఁజాలకున్నను చెప్పకున్నను నాకుఁదప్పదు. మనకటుల చెడుపని చేయవలదని బోధించునది పరమాత్మ. ఆపరమాత్మయే దేవుఁడు.

ఏమి? మహానుభావులారా! యిప్పటికైన దేవుఁడున్నాడని యొప్పుకొనియెదరా? ఒప్పుకొనరా? పరమాత్మయే దేవుఁడైన యెడల నొప్పుకొందుమందురు కాఁబోలు. నిస్సందేహముగాఁ పరమాత్మయే దేవుఁడు. ఇప్పటికి మీరు దేవుఁడుగలఁడని యొప్పుకొనుటచే మనమందఱముఁ గృతార్థులము.

ఇఁక మనము ముందడుగు వేయవచ్చునా! వేయవచ్చునని యో యందఱియభిప్రాయము. ఏమది? ఏమూలనుండియో మూలుఁగు వినవచ్చుచున్నది. ఇంకను దేవుఁడులేఁడనువాఁడెవఁడైనఁ గలఁడాయేమి? 'ఉన్ననేమి? వానితో మనకేమి?' అనియెదరా? అటులకాదు. పానకములోని పుల్లతెఱఁగున వానినడ్డుగా నుంపఁగూడదు. ఉంచిన మనపనికే యడ్డువచ్చును. కావున వానికి నొకమాటచెప్పి వానియడ్డు తీర్చుకొందము. అయ్యా! తమకింకను దేవుఁడులేఁడా? మంచిది. మీకొఱకిప్పటికి దేవుఁడులేఁడనియే యనుకొందము. ఇంతకుఁ దేవుఁడులేఁడని తమరనుటయెందుకు? దేవుఁడులేనివారికి స్వర్గములేదు; మోక్షములేదు; నరకములేదు. అందు

చేఁ దాము తమయిచ్ఛవచ్చినట్లు నడువవచ్చును. కాఁబట్టి దేవుఁ
డు లేఁడనుట స్వేచ్ఛగానడుచుటకు: కాని,

స్వేచ్ఛగానడుచుట మంచిదా? కాదా?

అను సంగతి చూడవలె. మొదట స్వేచ్ఛగా నడుచుటయననే
మి? కామక్రోధాదులకు లోనయి కోరరానివికోరుచు, అనుభవిం
పరానివి యనుభవించుచు, మంచివారిని దిట్టుచుఁ గొట్టుచు, పరు
లుబాధపడుచుండుట చూచియుఁ దనకుఁ జేతనయినవఱకైన ధన
సహాయముగాని వాక్సహాయముగాని చేయక పైపెచ్చువారి
మోసముచేసి, వారిసొమ్మపహరించి, వారిపైలేనినిందలుమోపి,
మనస్సులునొప్పించి బాధించుచు, నాకాయుష్యము నాకారోగ్య
ము నాకుధనమని యెల్లప్పుడు తనమేలేచూచుకొనుచు, శరీరము
స్థిరముగానెంచి లేచినదిమొదలు పరుండువఱకుఁ బొట్టనించుకొ
నుటకే దేవులాడుచు, నిమిషమున నశించు శరీరభోగములు ము
ఖ్యములుగాఁ దలంచి విలువగలబట్టలు నగలు మొదలగునవిధరించి
దిద్దుకొనుచు, అక్కఱలేని వేషములు వేయుచు, ఒయ్యారులను మె
ప్పించి వారివలన సుఖించుట కడ్డమైనగడ్డితినుచు, రోగములఁగొని
తెచ్చుకొని యిల్లును, ఒళ్లును గుల్లయై యేడ్చుచు, ఎప్పుడునుమాన
మును, ఒకప్పుడుప్రాణమును బోవునట్లు తాఁపులుదినుచు, గౌర
వమిచ్చి తెచ్చుకొనుమనుసంగతి తెలియకమన్నింపఁదగిన వారిమ
న్నించి మన్నింపఁబడక ధిక్కరించి యవమానపడుచు, పైపచ్చ
మోర్వలేక యితరులకొంపలు తీయుటకుఁ బన్నాగములుపన్ని తా
మే తమకొంపలు తీసికొనుచు, నాచేతఁగానిపని లేదనియు నన్ను
మించినవాఁడు లేఁడనియు విఱ్ఱవీఁగుచు, లోకమునకు శత్రువై యి

ట్టివాఁడు పుట్టిననేమి? చచ్చిననేమి? యనియో, చచ్చినఁ బీడవ దలునసియో దీవనలొందుచునుండుటయేకదా. ఇది దేవుఁడులేఁ డనుటవలన వచ్చిన ఫలమే కదా?

దేవుఁడులేఁడని నందులకీ లాభము చాలదా? వేఱేనరకము కావలయునా? కావలయునసిన లేకపోలేదు. ఎక్కడనున్నది? చచ్చినతరువాత నున్నదో మానినదో యెవరికిఁదెలియు? ఎవఁడు చూచివచ్చినాఁడు? అని దెబ్బలాటకు రానక్కఱలేదు. నేను జెప్పునరకము చచ్చినతరువాతఁ బరోక్షమునఁగాదు, బ్రతికియుండఁ బ్రత్యక్షముగా నిచ్చటనున్నదియే. అది దేవుఁడులేఁడని స్వేచ్ఛగా నడుచు ప్రతివాడు ననుభవించునదియె. ఏమి? మీకు వింతగానున్న దిగాని వింతయక్కఱలేదు వినుఁడు. ఎవఁడుగాని యేదోచెడుపని చేయఁదలఁచినపుడు పరమాత్మ యదికూడదనిబోధించును. ఆబోధవినినడుచుకొనినవానికి బాధయేమియు లేదుగాని దానిని లక్ష్యముచేయక చెడుపనిచేసినయెడలఁ జేసిన క్షణము మొదలుకొని పరమాత్మ వానినిబాధించుచునేయుండును. చేసిన చెడుపనికొలఁది బాధహెచ్చుచుండును. కొన్ని చెడుపనుల బాధయెప్పటికి నుండునదే. ఇదినరకముకాదందురా? నోరుమెదపఁజాలరు. ఇంతటితోనైనదా? సుఖములకని వెళ్ళఁగాఁ జెడునడతచే శరీరముచెడి, పుచ్చి, యెల్లప్పుడు తీపులుతీసికొనుచుఁ గుల్లి చచ్చువారి నెందఱిని మనకన్నులార మనముచూచుటలేదు? ఇదియే పెద్దనరకము. ఈ నరకమేల వచ్చినది? దేవుఁడులేఁడని యిచ్చవచ్చినట్లు నడుచుటవలన. ఇప్పుడు స్వేచ్ఛగా నడుచుట మంచిదో కాదో మీరే చూచుకొనుఁడు. ఇది ప్రత్యక్షప్రమాణముగాని యనుమానము గాదుగదా. అందువలనఁ బునర్జన్మమున్నదని యొప్పుకొననివా

రికిని వాకట్టే. కావునఁ బ్రత్యక్షముగా దేవుఁడున్నట్లు తెలియవచ్చుచున్నను లేఁడనిన వారును, దేవుఁడు లేఁడనుటవలనఁ దమకుఁ గలుగు బాధ ప్రత్యక్షమగుటచే లేదనఁజాలరు గాన నీప్రత్యక్షప్రమాణమే దేవుఁడుకలఁడనుసంగతి వారికి సిద్ధాంతపఱిచి చెప్పును. ప్రత్యక్షప్రమాణముకూడ నమ్మనను వాఁడున్నయెడల నట్టివాఁడు వెఱ్ఱివాఁడై యుండవలయును గనుక నట్టివానికి వెఱ్ఱి కుదురువఱకు నది బోధపడదు. ఇచ్చట నట్టివారిపని లేదు కావున నిజముగా నిప్పుడు మనమందఱమును గృతార్థులము.

దేవుఁడుకలఁడను నమ్మికయే మంచికిమూలముకావున నదియే మనలఁ గృతార్థులఁజేయును. మనము గని బంగారమువంటివారము. దైవభక్తి నిప్పువంటిది. రకమునుబట్టి కాలములో నెచ్చుదక్కువలున్నప్పటికి, నిప్పు బంగారము నెట్లు పరిశుద్ధముగాఁ జేయఁగలుగునో దైవభక్తియు మనలఁ బరిశుద్ధులుగాఁ జేయఁగలదు. కావున దైవభక్తిగలిగి మంచిగుణముల నవలంబించి తిన్నఁగా నడుచుకొనుచుండినయెడల దైవానుగ్రహమువల్ల మనము బాగుపడుదుము. ఇతరులను బాగుచేయఁగలుగుదుము. దేశమును బాగుచేయఁగలుగుదుము. ఇంతకంటె వేఱెస్వర్గము, మోక్షమును గావలయునా? స్వర్గమును, మోక్షమును మాత్ర మెందుకు? సుఖపడుటకు. ఇంతకు

సుఖమన నేమి?

దుఃఖము లేకుండుట. దుఃఖమన నేమి? మనస్సునొచ్చుట. మనస్సేలనొచ్చును? చెడుపనులు చేయుటవలన. చెడుపను లేల కలుగును? స్వేచ్ఛావిహారమువలన. స్వేచ్ఛావిహార మేలకలుగును? దైవభ

క్తి లేమివలన. దైవభక్తి యేల లేకపోవును? దూరాలోచనము లేమివలన. దూరాలోచన మేల లేకపోవును. పెద్దలశిక్షకు లోఁబడకుండుటవలన. కావునఁజిన్నతనమునుండియుఁ బెద్దలశిక్షకులోనై దూరాలోచనమును దైవభక్తియుఁ గలిగి స్వేచ్ఛావిహారము మాని, చెడుపనులుచేసి బాధనొందక మంచిగుణముల నవలంబించి తాను బాగుపడి, కష్టపడి యితరులను బాగుచేసి, పుట్టినందుకు నావిధి నేను జేసి నాజన్మము సార్థకము చేసికొనుచున్నానను నిబ్బరము వలన మనస్సు తేలికగా నుండుటయే సుఖము.

శరీరమువలనఁ గలిగిన సుఖమొక సుఖముగాదు. అదివట్టి యెండమావి. దానినపేక్షించుట బుద్ధిమంతునికిఁదగదు. నిజమగు సుఖము మనకీలోకముననే లభింప వీలున్నప్పుడు పరలోకముమాట యెందుకు? కావున స్వర్గము మోక్షము కావలయునని తమ మేలుమాత్రమే చూచుకొనక బుద్ధిమంతులిచ్చటనే స్వర్గము మోక్షమున్నవని యెంచి, పరులకు మేలుచేసి యందువలనఁ గలుగు సుఖము స్వర్గమోక్షముల సుఖములకంటె నెక్కువ సుఖమని తలఁచి పాటుపడుట మిక్కిలి మేలని నానమ్మకము. అట్టివారికిఁ బరోక్షమున నుండునో యుండవో యని యనుమానపడు స్వర్గమోక్షములతోఁ బనియే లేదు. కావున నామార్గ ముత్తమమని చెప్పఁదగు. ఒకవేళ నిజముగాఁ బరోక్షమున నుత్తమలోకములున్న, వాని యుండు లేముల నెన్నక పరోపకారముకొఱకుఁ దమ జీవముల ధారవోయఁదలఁచుకొనినవారి ప్రవర్తనము వానికి సాధకమే కాని బాధకమెంతమాత్రమును గానేరదు. అంతియకాక వానియునికి పులగముమీఁది పప్పు. చూచితిరా? అయ్యలారా! దే<u>వుఁడు లేఁడనుటవలన నెంతకీడున్నదో! దేవుఁడున్నాఁడనుటవ</u>

లన నెంత మేలున్నదో! కావున దేవుఁడు లేఁడని కలనైనఁ దలంపకుఁడు. అంతకంటె నెక్కువపాపము మఱియొకటి లేదు. దేవుఁడు లేఁడని తలఁచుటయే పాపమగునప్పు డావిధముగ ననుటయు, దానినిబట్టి యిచ్చవచ్చిన చెడుపనులు చేయుటయుఁ బాపములని వేఱుగాఁ జెప్పవలయునా? దేవుని యునికింగూర్చి రవంతయు సందేహింపకుఁడు. ఆపరమేశ్వరుం డెల్లప్పుడు నుండువాఁడు; ఉన్నాఁడు. ఆదయామయునియందు భారముంచి, దురభిమానముం జంపుకొని, ఫలకర్తృత్వము మనది కాదని మేలుగలిగించుపని చేయుటయే మనపని.

ఏమి సందేహించుచున్నారు? మఱేమియు లేదు. మీరు దేవుఁడున్నాఁడని చెప్పుట దూరముగా నాలోచింపఁగా మాకును యుక్తియుక్తమని నాటుటచే మేమునొప్పుకొనినాము. సరియే కాని

దేవుఁ డెట్టివాఁడు?

అయ్యలారా! దేవుఁ డిట్టివాఁడని మన మెన్నఁగలమా? వాక్కునకును మనస్సునకును దెలియరానివాఁడు. అతని గుణములకు లెక్కలేదు. కాన నెంత తెలివిగల మనుష్యుఁడును వానినన్నింటి గ్రహించి యెన్నఁజాలఁడు. ఎంత పెద్దయద్దమైనఁ బ్రపంచము నంతటిని దనలోఁ గనఁబఱుపఁగలదా? అయినను జేతనగునంతవఱకు సంగ్రహముగాఁ జెప్పఁ బ్రయత్నింతము. సర్వశక్తులుగలిగి, విలాసంబుగాఁ జరాచరంబగు ప్రపంచంబంతయు సృజించి, అంతటనిండి, సమర్థుండై యంతయుభరించి రక్షించుచు, దోషరహితుండై, సకలసుగుణంబుల కాకరంబై, తన్నుఁ దెలిసికొని కొలుచువారికిఁ దోడునీడయై వారికే లోపంబు లేకుండఁ బోషించి కష్టం

బులనుండి గట్టెక్కించుటయేకాక, తన్నుఁదెలిసికొనఁ జాలనివారినిగూడఁ బోషించి రక్షించుచు, తన్నెదిరించిన వారిమీఁదఁగూడ మాత్సర్యంబులేక వాత్సల్యంబున వారి తెలివిలేమినిమన్నించి మంచితోవకుఁ దీసికొనిరాఁజేయుచు, సర్వజ్ఞుండై నెల్లవారి చర్యలంగని పక్షపాతంబులేక వారిపనులంబట్టి సుఖదుఃఖములును, అధికారదాస్యంబులును గలిగించుచు, లోకచిత్రంబులం గనుచు, అన్నిరూపంబులుదానయై ప్రత్యేకముగా నొకరూపులేక, ఆదిమధ్యాంతంబు లివియని యెఱుంగ నవకాశమీయక యెప్పుడు నొక్కచందంబునం బరమానందస్వరూపుండై యుండు సర్వలోకైకేశ్వరుండు దేవుండు.

సరియేకాని దేవునికిఁ బక్షపాతబుద్ధి లేనియెడల నందఱి నొక్కవిధముగాఁ బుట్టించి పెంపక కొందఱి ధనవంతులుగాను, కొందఱిని దరిద్రులుగాను బుట్టించి, కొందఱిని సుఖపెట్టి కొందఱిని గష్టపెట్టుట యేమనికదా మీ సందేహము? బాగుగనున్నది!

దేవునకాపక్షపాతము!

మనుష్యుల స్థితిగతులయందుఁ గనంబడు భేదములకుఁ గారణము వారివారి కర్మమేకాని దేవుఁడు కాకపోవుటచే దేవునియందు మీరు లోపమారోపింపనేరరు. దేవునకు లోపమొక్కటియు లేదు. అయినఁ గర్మమేమియని కదా పైసందియము. ఆలకింపుఁడు. పూర్వజన్మములఁ జేసికొనిన మంచిచెడుపనుల ఫలమే కర్మము. అదియే యీజన్మమున నిట్టిభేదములఁ గలిగించుటకుఁ గారణము. మనుష్యులకొక్కజన్మమే యని చెప్పువారీభేదములకుఁ గారణమేమని చెప్పుదురు? దేవుఁడు పక్షపాతముగలవాఁడనియో

షమారోపించి యతని మహిమకు లోపము తెచ్చెదరా? మఱి యొకవిధముగాఁ జెప్పఁగలరా? ఏదియు లేదు. కావున మనుష్యున కొక్కటియే జన్మమనుటకు వలనుపడదు. అనేకజన్మము లున్నవను వారేమి చెప్పుదురనిన వినుఁడు. మొదటి జన్మమున దేవుఁడందఱి నొక్కవిధముగానే పుట్టించి యొక్కస్థితిలోనేయుంచి, చెడుత్రోవలఁబట్టి చెడక తిన్నఁగానడుచుకొని బాగుపడుఁడనియే నియమించినాఁడు. అతని యాజ్ఞానుసారముగా నడుచుకొనినవారు బాగుపడి యిప్పుడు మంచిస్థితిలోనికివచ్చి సుఖపడుచున్నారు; ముందు సుఖపడఁగలరు. అతని యాజ్ఞమీఱినవారు చెడిపోయి యిప్పుడు చెడుస్థితిలోనికివచ్చి కష్టపడుచున్నారు. ముందును గష్టపడెదరు. కాఁబట్టి మనుష్యులస్థితిభేదమునకు వారికర్మమే కారణముగాని దేవుఁడుగాఁడు.

పందెములకు విడుచునపుడు తగవరిసరిగాఁ జూచియే పందెగాండ్రనువిడుచును. తరువాత ఫలము వారివారి నడతను బట్టి యుండు. గెలువకపోయిన వానిలోపము వానిలోనె యుండును గాని తగవరిలోనుండునా? తగవరి నెవ్వరైన నిందింపఁగలరా? అట్లైమనము మనదుస్థితికి మనలనే నిందించుకొనవలెఁగాని భగవంతుని నిందింపఁదగదు. పరాత్పరునిందించుట పాపము మూటగట్టుకొనుటయె. తగవరి గెలిచిన వాని మెచ్చుకొనును; కష్టపడి యోడినవానిఁ గనికరించును; కష్టపడక యోడినవాని నుపేక్షించును; విరుద్ధముగానడిచినవాని నిందించి దండించును. దేవుఁడు నట్లైచేసినఁ దప్పేమియులేదుగదా? అయిన నతఁడు విరుద్ధముగా నడిచిన వారినిగూడ మన్నించుటకేచూచును. అదియే యతనిగొప్ప. కావున దేవుఁ డేవిధమునను నిందనీయుఁడు గాకపోవుటయే కాక యన్ని

విధముల వందనీయుఁడే. ఏమి? ఇంకను దేవునికిఁ బక్షపాతముగ లదందురా? ఎప్పుడు నట్టి వెఱ్ఱితలఁపు తలఁపకుఁడు.

బాగుగ నేయున్నది కాని మనకొక దేవుఁడు కాఁడుగదా? ఎవని కివందనంబు చేయుట? అని యందురు కాఁబోలును. మీ రీ ప్రశ్నయ డుగుదురని నాకుఁ దెలియును. ఇదియే మీ తెలివితక్కువ. దూరాలోచనము లేకపోవుట.

మనకొక దేవుఁడు కాఁడా?

ఎవరు చెప్పినారు? ఎవరు చెప్పుచదియేమి? బ్రహ్మ, విష్ణువు, శివుఁడు మొదలగు పేర్లన్నియు నెట్లువచ్చినవి? అందురాయేమి? అవియన్నియు నధికారములంబట్టి దేవునకువచ్చిన బిరుదు పేర్లు. మనుష్యులలో నొక్కొక్కనికే యెన్నియో బిరుదులుండునపుడు సర్వేశ్వరునికి బిరుదులుండుటవింతయా? అయిన విగ్రహములు మొదలగునవి యేమనియా మీసందేహము. అవి యక్షరములుకుదురుటకు గుంటయోనమాలవలెఁ బరమేశ్వరుపై దృష్టినిలుచుట కేర్పఱుపఁబడిన సాధనములు. అక్షరములు కుదిరినగుంటయోనమాలతోఁ బిల్లవాండ్ర కెట్లు పనియుండదో భక్తులకును దృష్టినిలకడ గలిగిన విగ్రహాదులతోనట్లెపనియుండదు. ఇట్టిసాధనముల యావశ్యకత మనుష్యులస్థితినిబట్టి వచ్చుచుండును. దీనినిబట్టి దేవుఁడొకఁడు కాఁడనియనుకొనుట వట్టి తెలివితక్కువ. ఇట్టి తెలివితక్కువచే మనమతము మంచిదిగాదని మఱియొకమతము నవలంబింతమని చూచువారికంటెఁ దెలివితక్కువవాండ్రు మఱియొక్కరుండరని నొక్కి చెప్పవచ్చును. దేవునిసంగతి కొంచెమైనను దెలిసినవాఁడిట్టి వెఱ్ఱిపని కలనైనఁ జేయఁడు. ప్రతిమతమునందును మనుష్యులస్థితినిబట్టి భేదములుండునుగాన వానిసంగతి తెలిసినవారొకమతమునుం

డి రెండవదానిలోని కెప్పుడును వెళ్లరు; వెళ్లవలసినపనిలేదు. అట్టి చోఁ దనమతమునువిడిచి మఱియొకదానిలోనికి వెళ్లుట వెళ్లినవాని తెలివిలేమిని వెల్లడిచేయు. తమమతము నవలంబింపనివారిని దేవుఁడు రక్షింపఁడనుటయు నట్టిదే. అయిన దేవుఁడంతపక్షపాతము కలవాఁడా? కాఁడు, ముమ్మాటికి దేవుఁడు పక్షపాతము కలవాఁడు కాఁడు. తెలియమిచేఁ దెలివితక్కువవాండ్రు తమపక్షపాతము నతనియందారోపించినను బుగ్గిమొదలగు కల్మష పదార్థములచేఁ గల్మషునిగాఁ జేయఁజూచిన నటుగాని సూర్యునివలె నతఁడును నిష్కల్మషుఁడై యుండునుగాని తనయందు లేనిలోపము లారోపించినటువంటివాఁడు కానేరఁడు. అతఁడు తన్నేవరేరూపమున నమ్మికొల్చిన వారి నారూపముననే కాపాడుచుండు కరుణాకరుండుగాని యెవరోచెప్పిన యొకరూపముననే కొలువకున్న విడుచు పక్షపాతికాఁడు. నమ్మకము ప్రధానముకాని వేఱొకటికాదు. నిజమున కెవరు నతనిరూప మిట్టిదేయని చెప్పఁజాలరు. ఆయన మహిమ, దానిని దెలిసికొనవలయునను నిశ్చయముతోఁ దమజీవముల ధారవోసిన మహాత్ములకే యవాఙ్మానస గోచరమనిన నింకఁ బెఱవారిమాట చెప్పనేల?

అట్టి దేవునికి వందనము చేయుటతప్పా? కాదు; ఒప్పే. సంధ్యావందనమా దేవునిగూర్చి చేయునట్టివందనమే కదా. అందుచేత సంధ్యావందన మన్నివిధములచేతఁ గావలసినదనియే తేలినదిగాని యక్కఱలేనిదని తేలలేను. కాఁబట్టి మనుష్యులందఱును సంధ్యావందనము చేయవలయును. అదియే మనుష్యుల బాగుచేయు ముఖ్యసాధనము. అది చేసిన వారెప్పటి పాపముల నప్పుడు పోఁగొట్టుకొని పరిశుద్ధులై సుఖింతురు. చేయనిచోఁ బాపముల

కుప్పలై చెడిపోయి కష్టములపాలయి దుఃఖింతురు. కావునఁ బోఁగొట్టికొన్న కాలమును బోఁగొట్టికొన్న నిఁకక్షణమైన వ్యర్థపుచ్చక సంధ్యావందనకల్పవృక్షము నాశ్రయించి, మీరుబాగుపడి, పైవారిని బాగుచేసి, దేశమును బాగుచేసి, దేవునికిఁబ్రియులయి, సంసారతాపంబుఁబాపుకొని, శాశ్వతసుఖంబొసంగు ఫలంబు ననుభవింపుఁడు.

ఇప్పటికి మీకీయఁదలఁచుకొనిన హితోపదేశమయినది.

ఇఁక ముందు మీరు చేయవలసిన దేమి?

సీ॥ (౧) దేవుండు గలఁడని స్థిరముగా నమ్ముఁడు;
(౨) పెద్దలమాటల విని నడువుఁడు;
(౩) మిము బాగుచేయఁజాల్మేల్సాధనమగు సం
ధ్యావందన మెపుడుఁ దగసలుపుఁడు;
(౪) పాడలవాట్లలవాటుపడ్డ విడుండు;
(౫) మంచివానలవాట్లమర్చుకొనుఁడు;
(౬) చెడుగుణంబులునున్న శీఘ్రంబవదలుఁడు;
(౭) మంచిగుణంబులఁ బెంచుకొనుఁడు;
గీ॥ (౮) మీరు బాగుపడుండు; (౯) ఆమీఁదఁ బరుల
బాగుచేయుట కెచ్చుగాఁ బాటుపడుఁడు;
(౧౦) దేశమును బాగుచేయుఁడు; (౧౧) దేవునకుఁ బ్రి
యతములరగుఁడు; (౧౨) మీరుకృతార్థులగుఁడు॥

శ్రీః

మానవవిధి.

గీ॥ మంచి చెడ్డలు గనువాఁడె మానవుండు;
బ్రతికి యున్నంతవఱకును వదలకుండ
మనసుతోఁ జేయఁ గావలసిన పని విధి;
మానవులొనర్పఁ దగువిధి మానవవిధి॥

మానవవిధి యన నేమి? మనుష్యులు తప్పక చేయవలసిన పనియే మానవవిధి. మనుష్యులన స్త్రీపురుషులు గాని పురుషులుమాత్రమే కారు. అదియేది? తాను మొదట బాగుపడి, చేతనగు నంతవఱకితరులను బాగుచేసి, దేశమును బాగుచేసి తనపుట్టుక సఫలముచేసికొనుటయే. ఇందుచే మానవవిధి త్రిభాగమని తెలివది. మొదటిది తాను బాగుపడుట, రెండవది యితరుల బాగుచేయుట, మూడవది దేశమును బాగుచేయుట. తాను బాగుపడినఁగాని యితరులను బాగుచేయుటకును, దేశమును బాగుచేయుటకుం దగిన శక్తి కలుగదుగావున మొదటిదియె మొదట సాధింపవలసినది. కాని;

తాను బాగుపడుటయెట్లు?

కొందఱియందు హెచ్చు, కొందఱియందుఁ దక్కువయను భేదమే కాని లోపములు లేనివారు లోకమునఁ గడునరిది. అట్లగుటచే మొత్తముమీఁద నందఱు లోపములుగలవారే. కాఁబట్టి బాగుపడవలయునను కోరికగలవాఁడు మొదటఁదనలోపముల దానుగనుఁ

గాని వానిని రూపుమాపఁ బ్రయత్నింపవలయు. సంధ్యావందనము నవలంబింపవలయును. విడని పట్టుదలతోఁ బ్రయత్నించిన యెడల సాధారణలోపములు సులభముగాఁ బోఁగొట్టుకొనవచ్చును. లోపములు రెండువిధములు- దుర్గుణములు, దురభ్యాసములు. దుర్గుణములకంటె దురభ్యాసములు సులభముగవదలును. కావున మొదటఁ దనకున్నపాడలవాట్లను, వానితోడనే చెడుగుణములను వదలించుకొనఁ జూడవలయును. దురభ్యాసములు సాధారణముగా దుర్జనస్నేహమువలనఁ గలుగును. కానఁ దాను బాగుపడవలెనను బుద్ధిపుట్టి మనస్సున నాటినతోడనే చెడుసహవాసము మానవలయును. అది మానినతోడనే దానివలనఁ దనకుఁ బట్టువడిన దురభ్యాసములను సాధ్యమగునంత త్వరలో విడువవలయును. ఇది సులభముగా నెఱవేఱుటకు మనస్సు ముఖ్యముకావున నామనస్సును జేతనగునంత దిట్టపఱచుకొనవలయును. మనస్సెంత దిట్టముగా నుండునో దురభ్యాసములును దుర్గుణములు నంతవేగముగా నిర్మూలములగును గనుక దానిపట్టువదలఁగూడదు. ఇట్లు గట్టిపట్టుతోఁ దనలోపముల మాపుకొనఁ బూనికొని యవి పెరుఁగుట కునికిపట్లగు దుర్జనస్నేహమును, మఱుఁగుస్థలములను జేరుటమాని, వానికిఁ జుక్క-యెదురని చెప్పఁదగిన సజ్జనసన్నిధిం జేరిన సూర్యచంద్రుల యెదుటఁ దలచూపఁజాలని చీఁకటులవలె నవియును దలయెత్తుటకవకాశములేక మురుగుడుమున్నెండఁగా దానితోడనే నశించు పురుగులచందంబున రూపుమాయు. దురభ్యాసములు పోయిన దుర్గుణములును వానిదారినేపట్టును. తరువాత నిట్టిప్రయత్నము చేయువానికి దైవముతోడై తనదయారసంబు వానిపైఁగురియు. సజ్జనులగు పెద్దలసహాయంబున సుగుణంబు లొకటియొకటి తనమనం

బున నాటి పెరిఁగి యాపరించునటుల చేసిన, సంపెంగతోఁటయం దుమ్మెదలు చేరనితీరునఁ జెడుగుణంబులు చేరకయుండు. తానిటుల తన దురభ్యాసంబులను దుర్గుణంబులను నిర్మూలంబొనరించి, లోపంబులేవియులేవను నిబ్బరముగలిగి, మంచియలవాట్లును మంచిగుణములును దనయందు నాటుకొని పెరిఁగి ఫలించు స్థితిలోనికివచ్చినపుడు తానితరుల బాగుచేయుటకుఁ బూనుకొనఁ దగినవాఁడగును; కానఁ దాను పైఁజెప్పినదశకు వచ్చెనను నిబ్బరముఁగలవాఁడు రెండవమెట్టనఁదగు పైవారిబాగుచేయుటకు మొదలుపెట్టఁదగును.

పైవారిని బాగుచేయుటయెట్లు?

జన్మమెత్తినందులకుఁ దనమేలుదాను జూచుకొనుటయే ఫలము కాదు కానఁ జేతనగునంతవఱకుఁ దనతోడివారికి సహాయపడి బాగుచేయఁ బూనుకొనుట బుద్ధిమంతుని లక్షణము; కావునఁ దాను దనలోపముల నేప్రకారము పోఁగొట్టుకొనినాఁడో పైవారిలోపములను సాధ్యమగునంతవఱకుఁ గష్టపడి నయమువలయుచో నయమును భయము వలయుచో భయమును నుపయోగపఱిచి పోవునటులచేసి, మంచియలవాట్లును మంచిగుణములను వారికిఁ బట్టుపడునట్లొనరించి, తనవలెనె వారును బైవారిని బాగుచేయుటకుఁ దగినస్థితిలోనికి వచ్చునట్లు చేయవలెను. అటుల తనచే బాగుపడినవారు తాను బూనుకొనిన మంచికార్యములయందుఁ దోడుపడుదురు. అందుచే దేశమును బాగుచేయుటకు వీలగు.

దేశమును బాగుచేయుటయెట్లు?

పైనిజెప్పినరీతిని సాధ్యమగునంతవఱకుఁ దమయందులోపము

లు లేకుండఁ జేసికొని, సద్గుణంబుల దినదినంబు నభివృద్ధినొందించుకొనుచు, తమ మేలు చూచుకొనుట ముఖ్యముగాదని యెఱింగి, వీలగునంతవఱకుఁ దోడివారికి సహాయపడి మంచిదారికిఁ దెచ్చి, తెచ్చుచు, తమదారి నవలంబించిన వారితోడ్పాటుతోఁ దమదేశంబునంగల లోపంబులఁ గనుంగొని, తాము మొదటఁ దమలోపంబులఁ బోఁగొట్టికొనినకైవడి దానిలోపంబులం దగుసాధనంబులఁ దీర్చుటకుఁ బూనుకొని, కష్టంబునకు వెనుకదీయక సాధ్యమగునంత త్వరలో వానిం బాపి, పిమ్మట దానియభివృద్ధికిఁ గారణంబులగు సాధనంబుల నమర్చి, తాము తమసద్గుణంబులఁ బెంచుకొనునట్లు వానిఁ బెంచుచుండిన దేశంబు బాగుపడి, తానును బరదేశముల యపేక్షతనకు లేక తానె పరదేశంబులకుఁ దోడ్పడు స్థితిలోనికివచ్చు. దేశము నిట్టిస్థితిలోనికిఁ దెచ్చుటయే దేశమును బాగుచేయుట. తమదేశము నభివృద్ధిలోనికిఁ దెచ్చుటకంటె నందుఁబుట్టినవారికి నెక్కువమంచిపనియున్నదా? మానవులై పుట్టినవారికి స్వదేశాభిమానము వలదా? తమ్ముఁ బెంచి పెద్దవారిని జేయు తమదేశమునకుఁ దాము తోడ్పడకుండుట కృతఘ్నతగాదా? కృతఘ్నతకంటె నెక్కువపాపము గలదా? పాపఫల మనుభవింపక యూరకపోవునా? తమ్ముఁ బాలుపెరుఁగులిచ్చి పెంచునావును దాము బాగుచేయకున్నఁ గొలఁదికాలములోనె యది చిక్కి, తాను బాడయి తమకుఁ బనికిరాకుండఁబోదా? దేశము మాత్ర మట్టిది కాదా? కావునఁ గాలక్షేప మగుచున్నది గదా యని యేమఱియుండి యొగఁదన్నినతరువాత నోరు తెఱచుకొని చూడక, ముందే తెలివితెచ్చుకొని దానిని బాగుచేసికొనుటకుఁ బూనుకొనవలయును. దేశ మొకనిచే బాగుపడునది కాదు. దానికిఁ బలువురుగలిసి పాటు

పడవలయు. పలువురుగలిసి పనిచేయుటకు మనసులొకటి కావలయు. మనసులొకటియగుటకు మంచిగుణములుండవలయును. మంచిగుణము లలవడుటకు సజ్జనసాంగత్యము ముఖ్యము. సజ్జనసాంగత్యము తాను బాగుపడవలయునను గట్టి నిశ్చయము చేసికొనినవాఁడేకోరు. కాఁబట్టి మనుష్యులనిపించుకొనువారందఱును మొదటఁ దాముబాగుపడి, సాధ్యమగునంతవఱకుఁ బైవారిని బాగుచేసి, అందఱుంగలిసి దేశమును బాగుచేసి, తమజన్మమును సార్థకముగాఁ జేసికొనుటకుఁ బ్రయత్నింపవలయును.

ఇందువలన మీరు మనస్సున నెప్పుడు గుఱిగా నుంచుకొనవలసిన సంగతి యేమి?

గీ॥ తాను మొదట బాగుపడి, యితరులబాగు
చేసి, తనదేశమును బాగుచేయ సరిగఁ
బూనుకొని పనిచేయుట మానవవిధి;
అరసి, దీనిని జేసి కృతార్థులగుఁడు॥

తమవిధిచేయుక్రమము.

గీ॥ ఈశ్వరుఁడు గాక సర్వజ్ఞుఁ డెవఁడుఁగాఁడు
కాన దురభిమానంబును మాని లోప
ములు మనకుఁగల్గు నని వాని మొదటవదలు
కొనుదమని నిశ్చయ మొనర్చు కొనవలయును॥

గీ॥ అట్టినిశ్చయమున సంధ్యలందు దినముఁ
బరునికిన్ వందనము చేయవలయు; దానఁ

గొన్నిదినములలోననే కొలఁది లోప
ములు తలలుమాడి యంత నిర్మూలములగు॥

గీ॥ వదలకటు చేయుచుండినఁ బిదపఁ బెద్ద
లోపములు కూడఁ గ్రమముగా రూపుమాయు;
అంతటఁ బరాత్పరుండు దయారసంబు
కురిసి మదిపొలమును సమకూర్చుఁబనికి॥

గీ॥ అందు సుగుణంబులను నాటి యనుదినంబు
మెలఁకువగఁ బెంచుచుండినఁ గొలఁదికాల
ముననె యవిపండు; అఫలములనుదినుటె
మనము నిజమగు సుఖమును గనఁబోడఁగుట॥

గీ॥ అంతతోఁ దృప్తిఁజెందక సంతసమునఁ
బాటుపడుచున్న నెప్పుడు ఫలములంద
వచ్చు; కానియవన్నియుఁ బరుల కిడక
తానుమాత్రము తినుటకె తలఁపఁదగదు॥

గీ॥ మొదటఁ దనమేలు గనుటయే ముఖ్యమైన
నదియయినపిమ్మటను మాత్రమట్లుగాదు;
తానుమేలుగను ఫల మితరులమేలు
గనుటయేకాన నదియెముఖ్యంబునగును॥

గీ॥ అందుచేఁ దాను దనచేతనయిన వఱకుఁ
దాఁ దినుఫలంబు పరులకుఁ దాల్పవలయు;
అంతియేకాదు; అవసరమైన యెడలఁ
దానుమానియు నిచ్చుట తగుమగఁటిమి॥

గీ॥ అటుల పైవారిమేలు తా నరయుచున్న;
వారుబాగుపడి పరుల బాగుచేయు

వారలగుదురు; అప్పుడు వారు తమకుఁ
దోడుపడుట్లాక వింతయా! తోడ్పడుదురు॥

గీ॥ అయిన వారితోఁడ్పా టెందుకని యనకుఁడు;
కావలె; ఎవరి మేల్వారు గనుటతోనె
తమవిధిముగియలేదు; పెద్దపనిముందు
గలదు; దానికి సందఱుఁ గలియవలయు॥

గీ॥ సరియె; ఆపనియేమి? దేశంబుబాగు;
అది యొనర్పుట యొకనిచే నగునె? దాని
కొండొరులతోడుతప్పక యుండవలయు;
కలిసి యొకమదితోఁబని సలుపవలయు॥

గీ॥ అటులు పనియొనరించి దేశాభివృద్ధి
చేయువారలె తమవిధి చేయువారు;
మానవులమనుకొన నర్హులైనవారు;
ఒడలు విడిచిన బ్రతికియేయుండువారు॥

గీ॥ అయ్యలార! మీరట్టి వారగుట తగదె?
లెండు; మీవిధిఁదెలిసికొనుండు; మీరు
బాగుపడుఁడు; దేశంబును బాగుచేయుఁ
డరసి దీనిని జేసి కృతార్థులగుఁడు॥

శ్రీ.

మానవవిధి.

సంవాదము.

[ఇద్దఱువిద్యార్థులు విహారమునకు వెళ్లి వచ్చుచుందురు.]

మొ. వి—[విచారముతో] చా! మనము కాలమంతయు వ్యర్థము
గాఁ బాడుచేయుచున్నామురా. మనుష్యులమైపుట్టిన లా
భ మేమి?

గీ॥ ఎందులకుఁ బుట్టినారమో యెఱుగకుండఁ
తినితిరిగి తెల్వి మాలిన పనులుచేసి
యెప్పుడోచావ నీజన్మమెత్తుకంటెఁ
బశువులుగఁ బుట్టియుండిన బాగుగాదె?॥

రెం. వి—ఏమి? ఈలాగు మొదలుపెట్టినావు? రేపు లోవతోఁ
టకు రావా యేమి?

మొ. వి—ఓరీ! నీకిప్పటికిబుద్ధిరాలేదా? కొంతవఱకుఁ దెలియక,
కొంతవఱకుఁ దెలిసి యేవో తెలివితక్కువపనులు చేసి
నాము; అయిపోయినది. చచ్చునంతవఱకదియే దారియా?
దీనిలో నేమున్నదో చూచినావా? (ఒక కాగితమువిప్పి)
చూడు. "గీ॥ ఎందులకుఁ బుట్టినామని యెంచుకొనుఁడు;
తిని తిరిగి చచ్చుకొఱకుఁ గాదనియెఱుఁగుఁడు;

వేగమవివేకపుంగన్ను విప్పి కనుఁడు;
అరసి మీవిధిచేసి కృతార్థులగుఁడు॥
గీ॥ ఏక్షణంబునఁ జత్తువో యెఱుఁగలేని
యట్టిదిగదా మన తెలివి! అయ్యలార!
దీని కా కన్నుగానక తిరిగి చెడుట;
క్షణముగోల్పోక మీవిధి సలుపుకొనుఁడు॥"
ఏమి? ఇప్పుడేమనియెదవు?

రెం. వి— ఏమనవలె? (నగుచు) ఇది చూచియా నీకింత వైరాగ్యముపుట్టినది. అయినసరియే. ఇంటికి వెళ్లి భోజనము చేయువఱకే యీబుద్ధి.

మొ. వి— ఆలాగుననే యనుకొమ్ముగాని నీబుద్ధియేమియు మాఱలేదా?

రెం. వి— ఎందుకుమాఱవలె? సుఖముననున్న ప్రాణమును గష్టపెట్టుకొనుటకా?

మొ. వి— ఊఁ. ఆలాగా? సరియేకాని
గీ॥ ఎఱుఁగకడిగెద సుఖమన నేమొ చెప్పుమ?

రెం.వి.— బాగుగఁదినుట; ఇష్టులౌ వారితోడఁ
గూడి తిరుగుచు నాడుచుఁ బాడుకొంచుఁ
గాలమును గడుపుటయె సుఖంబుసుమ్ము॥

మొ. వి— ఇదియానీసుఖము?

రెం. వి—నాసుఖమే కాదు; అందఱిసుఖమునిదియె. ఇంతకంటె నీసుఖము మఱియొకటియున్నదా యేమి?

మొ.వి—నాదే కాదుగాని, యిప్పుడు నేనెఱిఁగినదొకటియున్నది.

రెం. వి—ఏమది? చెప్పు, చూతము.

మొ వి—విను.

"గీ॥ స్వేచ్ఛసుఖమన నేదన- జన్మ మెత్తి
యందులకు నేను నావిధినాచరించి
దాని సఫలంబు చేయుచున్నానని మది
నిబ్బరంబునఁ దేలుచు నెగడుచుంట;
కాని, కానిది తిని త్రాగి కానివారిఁ
గూడి కాని పనుల్ చేసి కులుకుచుఁదమ
యొడలు తమకుఁగూడఁ దెలియకుంట కాదు
కాదు వేమాఱులకు నైనఁ గాదు కాదు॥"

రెం. వి—ఎక్కడిదిది? నాకేమిబోధపడకున్నది. విధి యేమిటి?

మొ. వి— అది తెలిసిననిదియు నప్పుడే తెలిసియుండును. కాని యొకమాట. మనుష్యులమై పుట్టినందుల కేమి చేయవల యునని యెదవు?

రెం. వి— ఏమి చేయవలె? చక్కఁగాఁదినవలె, తిరుగవలె, హాయి గాఁగాలముగడుపవలె. అంతకంటె మఱియేమియున్నది?

మొ. వి— అంతే, మఱేమియు లేదు! అయినఁదినుటకేమైన గడిం చుకొనవలెనా? అదియు నక్కఱలేదా?

రెం. వి— పెద్దలు గడించినది యేమగును? లేకున్న గడించుకొ నెదరు.

మొ. వి—గడించుకొనుటకు దారియేదైనఁగావలయునా? ఎక్క డనైన దొరకునా?

రెం. వి—ఒకదారియేమి? కావలసినన్ని దారులున్నవి- చదువుకొ నువారు చదువుకొని యుద్యోగములు చేయుదురు; చదువు కొనని వారు వారికిఁ దగినమఱియేపనియో చేసికొందురు.

మొ. వి—— సరియే. ఏదీ, నీమానవవిధి?

రెం. వి—— ఏమియున్నది?

గీ॥ ధనముగలవారు స్వేచ్ఛగాఁదిని తిరుగుచు
లేనివారు చదువుకొనియేని మఱియొ
కవిధమున నేని పనిచేసి కడుపునింపు
కొనుచుఁ గాలమును గడుపుకొను టెసుమ్ము॥

మొ. వి—— నీమానవవిధి యదియే కాని సరియైన దదికాదు.

గీ॥ పుట్టినందుకుఁ దినుటయా ముఖ్యఫలము?

రెం. వి—— అవును; తినకున్న సుఖమెటులబ్బు? సుఖము
పడకయున్నను బ్రతికిన ఫలమిఁకేమి?

మొ. వి—— మనము బ్రతుకుటకు ఫలంబు తినుటగాదు.

రెం. వి—— అయినఁ దినుట మొదలయినయవి వలవదె?

మొ. వి—— వలయును శరీరపుష్టికి వలయువఱకు.

రెం. వి—— వానికిధనంబు గడియింపవలదె?

మొ. వి—— ధనము
న్యాయమార్గంబునం దెంతయైనఁగూర్ప
వలయుఁ; బైవారికై వ్యయపఱుపవలయు;
వలసినది తాను వాడుకోవచ్చుఁ; గాని
తనకొఱకుమాత్రమే కూర్పఁదగదు; నిజము.

రెం. వి—— ధనము గడియింపఁ జదువుకోఁదగదె?

మొ. వి—— తనదు
జ్ఞానవృద్ధిని జేసికో, న్యాయమునధ
నమ్ము గడియించి సరిగ వ్యయమ్ము చేయు
కొఱకయినఁ దగుఁ; గానియా గుణమె లేక

తనసుఖంబుల కగునను ధనముకొఱకె
నైన రవ్వంతయుఁదగదు; దానిపరువు
తీసివేయుటయొకద యీ తెలఁగు; కానఁ
దుచ్ఛసుఖములకు ధనంబు దోఁచుకొనెడు
తలఁపున నెన్నైనఁ జమవుకోఁ దగదుతగదు.

రెం. వి— తనసుఖంబున కేదియుఁ దగనియెడల
నీశరీరము గల ఫలమేమి చెపుము?

మొ. వి— తనవిధి యొనర్చుకొని శాశ్వతసుఖముగను;
సుఖమనిన నీవు చెప్పిన సుఖముకాదు.

రెం. వి— అయిన మనవిధి యేమని యనెదవీవు?

మొ. వి— మనము మొదట బాగుపడియు వెనుకఁ బరుల
బాగుచేసి దేశంబును బాగుచేయు
నీమమునుబూని పనిచేయుటే మనవిధి॥

రెం. వి— అబ్బ!
గీ॥ కష్టమిది, చాలకష్టము!

మొ. వి— కష్టమ? ఊఁహుఁ;
కష్టమక్కఱలేక సుఖము కలుగునె?

రెం. వి— ఏమి? కలుగకపోవుట యేమి? కష్ట
మెట్టిదో యెఱుంగకుండ నే యెందఱొ సుఖ
పడుచునుండఁగనమె!

మొ. వి— అది వట్టి భ్రమయె.
కష్టపడకుండ వచ్చు సుఖంబు లేదు;
కష్టమెఱుఁగకయున్న సుఖము తెలియదు;

కానఁ గష్టములేని సుఖంబుసున్న.

రెం. వి— కష్టపడుదుము, మంచిదే; కాని, కష్ట
పడిన మనమె దేశంబును బాగుచేయఁ
గలమె?

మొ. వి— సందియమేమి? లోకమున నిపుడు
బాగుపడిన దేశంబుల వారలిట్టి
సందియంబునఁ దమవిధి సలుపకున్న
నవియు నడుగంటియుండవే? అదితలంచి,
సందియముమాని వారలేచందముననొ
గష్టపడినారొ మనమటు కష్టపడినఁ
బరుని దయ మనదేశంబును బాగుచేయఁ
గలుగుదుము; నిజమదె జన్మఫలము సుమ్ము.
పరులు తమదేశమును దాము బాగుచేసి
కొనుట కనులారఁగాంచుచు మనముకష్ట
మనుచు మొదలెదానికిఁ బూనుకొనకపసుల
వలెఁదినుచుఁ దిరుగుచు మఱివానికంటెఁ
దక్కువగఁగూడనడుచుచుఁ దగుదుమనుచు
మనజులమటంచుఁ జెప్పుకోఁ జనునె? ఇదియె
తాముచెడుట, పైవారలఁ దమవిధమునఁ
జెఱుపుట, తమదేశంబును జెఱుపుట; ఇటు
వంటిపుట్టుకగనకున్న బాగు; కానఁ
గష్టమని యెప్పుడుం బలుకంగఁదగదు;
బాగుకోరినచోఁ గష్టపడవలయును;
కష్టపడువాఁడె సుఖమును గాంచఁగలుగు;

కష్టమనిజంకువాఁడెప్డు కష్టపడును;
కష్టమునకు జంకమియె మగతనముసుమి;
కాననిఁక మగవారముగాఁ దలఁచిన,
మనము బాగుపడుటకుఁ గోరిన, ఇతరుల
బాగుచేయ, దేశంబును బాగుచేయఁ
దలఁచినను గష్టమనుమాట తలఁపఁదగదు.

రెం. వి— అటులచెప్పెదవే కాని యాలకింపు
మొకట—మాట- చిన్నప్పటినుండి యొడలు
వంచి కష్టపడక యిచ్ఛవచ్చినటుల
తిని తిరుగుచున్నవారము మనమిపుడొక
మాఱుమంచివారలముగా మాఱి కష్ట
పడి పరులను దేశముఁగూడ బాగుచేయఁ
గలుగుదుమనుకొనుట వెఱ్ఱిగాదెచెపుము?

మొ. వి— కాదు మగతనముండినఁ గాదు కాదు.

రెం. వి— మగతనమన నేమి?

మొ. వి— వినుము—తగనిదియని
తెలిసినది మాని, తగునని తెలిసినయది
యెంతకష్టంబుపడనున్న నించుకేని
భయపడక చేయఁజాలు నిబ్బరముసుమ్ము.

రెం. వి— అయిన నిదిమాత్రముండునా యందఱకును?

మొ. వి— ఉండదనుమాట కనఁబడుచున్నదైన
నుండవలె మగవారికి నుండవలయు;
మగతనము గల్గువారలె మనుజులుసుమి.

రెం. వి— ఐన మనమింతవఱకును మానవులము

కామె?

మొ. వి— పేరునకగుదుము.

రెం. వి— (తలయూఁచి) ఏమొనర్పఁ
దలఁచితిఁక?

మొ. వి— మానవుఁడనుగాఁ దలఁచినాఁడ.
నీదు నిశ్చయమేమిటి?

రెం. వి— నిజముదెలుప
నాకు మానవుఁడనుగా మనంబుగలదు
కాని కాఁగలనాయని కలుగుజంకు;

మొ. వి— యత్నమొనరింపఁ గాని దెయ్యదియులేదు
కాన సందేహమొందక కడఁగుదమిఁక;
సరిగనడిచిన మనకునీశ్వరుఁడుతోడు
పడును; పరమేశుతోడ్పాటు పడయు నెడలఁ
గాని కార్యంబుగలదె జగంబునందు?

రెం. వి— సరియె, నేనును నీవలె నలుపువాఁడఁ
గాని మనము మొదటచేయఁగావలసిన
దేమి?

మొ. వి— ఏమున్నది? మనము నియమమును
మనవిధి యొనర్చుకొని వేగ మనుజులగుటె;
దాని క్రమమంతయుఁగలదు 'మానవవిధి';
అది చదివి దానిఁబట్టిచే యంగవలయు.

రెం. వి— సరియె, యిఁక దానిఁబట్టియే నలిపి జన్మ
మును సఫలముగఁ గావించుకొనుదముపద॥

(నిష్క్రమింతురు.)

శ్రీః

మానవవిధి.

తెలుఁగు సంధ్యావందనము.

మేలుకొనినతోడనే చేయవలసిన వందనము.

గీ॥ పగటిపూఁటఁ గష్టపడి బడలిక రాత్రి
యొడలు మఱచి నిద్ర నొందునపుడు
కంటిఱెప్పవోలెఁ గరుణననుం గాచి
వందుకిదిగో దేవ! వందనంబు॥

గీ॥ చంద్రునకునూలు పోఁగను చందమునను
నీకువందనమిడుకంటె నేనొనర్పఁ
గలుగు ప్రత్యుపకారంబు గలదె? కాన
నిందుకానంద మొందు మానందరూప!॥

చ॥ సరియిఁకఁ దెల్లవాఱినది; సాగకపోదు శరీరయాత్ర; ఎం
దరసిన నన్నికష్టములె; అక్కట! వానినిదాఁటు టెట్టులో?
కరముభయంబుగల్గు నటు గానదయాకర! తోడునీడవై
దురితముపాలుగానిగతిఁ దోడ్కొనిపోఁగదె నీకుమ్రొక్కెదన్॥

ఇట్లు భగవంతునియందే మనస్సునిలిపి ప్రార్థించి లేచి దేహబాధలుతీర్చుకొని వీలగువారు స్నానముచేసి యీక్రింది ప్రాతస్సంధ్యావందనము చేయవలయును. ఏపనికిఁగాని మనస్సుప్రధానము గావున మనస్సునిలకడగా నుండునట్లు చేసికొనుటకు ముఖ్యముగాఁ బ్రయత్నము చేయుచుండవలయును.

ప్రాతస్సంధ్యావందనము.

ప్రతిజ్ఞ.

గీ॥ స్నానమున మేను శుభ్రమై నట్ల మనస్సు
నటుల గాఁజాలదందుచే నఖిలపాప
హరుఁడయిన హరి ధ్యానంబు నాచరించి
వెలిని లోపల శుచిగ నొప్పెదనుగాక॥

తొలివందనము.

గీ॥ దేవదేవ! నారాయణ! దీనపాల!
వాసుదేవ! అధోక్షజా! దాసలోల!
సర్వలోకేశ! అచ్యుతా! సర్వశక్తి!
పాపనాశన! నీకిదే వందనంబు॥

(వీలగునపుడు మొదటిపాదమునందలి మూఁడు పదములనుచు నాచమింపవలయు.)

సీ॥ జగములఁబుట్టించి సంరక్షణ మొనర్చి
సమయించి మరలించు సర్వశక్తి!
అంతటనుండి లేనట్టులె యనుకొన
వచ్చునట్లుండు సర్వాంతరగతి!
అంతయుఁగనుచుండి యరయ నేరును గనఁ
జాలని యటులుండు సర్వసాక్షి!
అన్నిరూపములు నీవగుట నేదోరూపె
నీవనియనరాని నిఖిలరూప!
నీమశక్తులు వర్ణింప, నిన్నుఁదెలియ,

నిన్నుఁగనుఁగొన, నీరూపమెన్నఁ జాల;
ఓపరాత్పర! సర్వజ్ఞ! ఓమహేశ!
అందుకొను భక్తి నేఁజేయు వందనంబు॥

సీ॥ మొదలు నడుమ తుది యిదియని చెప్పలే
కనుపీని యాదిమధ్యాంతరహిత!
అన్నిపనుల్ చేయు చున్న వానికిఁగర్త
నీవనియనఁని నిర్వికార!
సర్వాత్మకుఁడవయ్యు సౌఖ్యదుఃఖంబుల
నొందక వెలయు నానందరూప!
ఎవ్వరేరూపున నెంచికొల్చినవారి
యభిమతమిచ్చు దయాసముద్ర!
నీదు తత్వంబుఁగని యెన్న నేర; నాదు
తెలివిలేమిని మన్నించి, తెలివియిచ్చి
మంచిదారిని బట్టించి, మనుపు దేవ!
దండమునఁగొల్చి చేసెద వందనంబు॥

గీ॥ దేవదేవ!—అను పద్యముమరలఁ జదివి యాచమించి నమస్కరించి.

ఇంద్రియ నిరాకరణము.

గీ॥ క్రొత్తగుఱ్ఱాలలోఁబడఁ గొట్టి తిన్నఁ
గానడుపఁజాలు సారథి కరణి నేను
నెప్పటికిఁ గ్రొత్తగానుండు నింద్రియములఁ
గుదురుగానిల్పి నడుపఁ జాలెదనుగాక॥

గీ॥ దారివిడనాడి బండియుఁ దామఁగూలి
బండివానిని గూల్చి దెబ్బలుతినియెడి

తెలివి మాలిన గుఱ్ఱాల తీరు గాక
యనువుగానుండుఁడీ యింద్రియంబులార!

దేవదేవ-అనుపద్యము మరలఁజదివి నాచమించి నమస్కరించి.

దీక్ష.

గీ॥ ఈశ! నీయాజ్ఞజరిగెడు నీప్రపంచ
మందు భారతఖండంబునందు నేఁడు
నాదుపాపంబుఁ దీర్చుకొనన్నలి పెద
భక్తి నినుఁగూర్చి ప్రొద్దుటి వందనంబు॥

పాపమార్జనము.

క॥ నారాయణ! నీనామో
చ్చారణమున శుద్ధమగుచుఁ జను నీనీటన్
దూరముగాఁ దోలుము నా
ఘోరపుఁబాపముల, నిన్నుఁ గొల్చెదమదిలో॥

[పైపద్యముచదువుచు నీళ్లు తనపైఁ జల్లుకొనవలయును.
నీళ్లు లేనియెడ నీక్రిందిపద్యము వాడవలయును.]

క॥ నారాయణ! నీనామో
చ్చారణమున శుద్ధినొంది చనుననుఁబాయన్
దూరముగాఁ దోలుము నా
ఘోరపుఁబాపముల, నిన్నుఁ గొల్చెదమదిలోన్॥

పశ్చాత్తాపము.

[సంధ్యావందనంబునఁ బశ్చాత్తాపంబు ముఖ్యంబుగావున దానివలన బాగుపడఁదలఁచినవారు తమయింద్రియములలోఁ బ్రతిదానిచేతను జేసిన చెడుపనుల నన్నింటిని దలంచుకొని, అవి చేసినందులకు మిగులవగచి, అట్టివి మరలఁజేయమని నిశ్చయము చేసికొ

నవలయును. ఆనిశ్చయప్రకారము నడుచుటకుఁ బ్రయత్నము చేయునపుడు దానికి విరుద్ధముగా నడుచుటకు మనస్సు పుట్టినను లోఁబడక తమ యేర్పాటు తప్పకుండునటుల నిబ్బరముగానుండ మొదలుపెట్టినఁ గ్రమక్రమముగాఁ జెడుపనులుచేయుటయు, చెడుమాటలు మాటలాడుటయు, చెడుతలంపులు దలంచుటయుఁ బోయి తాము పరిశుద్ధులగుదురు. ఇదియే పశ్చాత్తాపమువలనఁ గావలసినపని. ఇదియే తాము బాగుపడఁదలంచినవారు మొదటఁ బొందవలసిన ఫలము. మనస్సు, మాట, పని- అను త్రికరణములం బరిశుద్ధులగువారే లోకమునకుపకారము చేసి, దానివలన నిజమగుసుఖమును బొందఁ గలుగుదురు. ఇదియే జన్మమెత్తుటకు ఫలము.

కావున మానవులమనుకొనువారందఱును మొదటనే యింద్రియములజయించుట కష్టమనియూరకుండక నిబ్బరముతోఁబ్రయత్నము చేసిన సులభమగునని యెఱింగి, ప్రయత్నించి, వానిని జయించి, మగవారనిపించుకొని, తాము స్వచ్ఛసుఖమునొంది, లోకమునకు మేలుచేసి, తమ జన్మము కృతార్థముచేసికొందురుగాక.]

సీ॥ కానిభోగంబులఁ గాంక్షింపఁ జేసెడి
కామంబువల్లను గలుగుదోసఁగు,
తనతోడివారల మనసులునొప్పించు
క్రోధంబువల్లను గూడుదోసఁగు,
పైవారలకుఁ దోడుపడకుండ నడ్డెడు
లోభంబువల్లను లోఁగు దోసఁగు,
ఒకటిమఱొకరీతి నున్నట్లుతోఁపించు
మోహంబువల్లను మూఁడుదోసఁగు,
ఇతరులకుంగీడు నేనొనర్పించెడు

మదమువల్లను నెప్పు డొదవుదోసఁగు,
పెఱవారు సుఖపడఁ బ్రీతినోర్వఁగనీని
మచ్చరంబువలన వచ్చుదోసఁగు,
మఱియు నెన్నెన్నిదోసఁగులో మఱుఁగుపాటు
గా నెసంగెడి మానసికమగు పాప
మేమియేన్ రాత్రిచేసితి నేనిదాని
నిక్కమగువగచిచ్చున నీఱొనర్పు॥
సీ॥ కనరానిపై యందగత్తెల సొగసులు
గను కంటివల్లను గలుగుదోసఁగు,
వినరానిమాటల వేడుకతోడుత
వినెడువీనులవల్ల నొనరుదోసఁగు,
పీల్చఁగారానిచో విలసిల్లుకమ్మ తా
వులఁబీల్చుముక్కుచేఁ బొందుదోసఁగు,
తినరానివస్తువుల్ దిని ద్రాఁగరానివి
గ్రోలు నాలుకవల్లఁ గూడు దోసఁగు,
తాఁకరానివి తాఁకెడు త్వక్కువలని
దోసఁగున నెడిజ్ఞానేంద్రియ చరితసమితి
నేమియేన్ రాత్రిఁ జేసితి నేనిదాని
నిక్కమగువగచిచ్చున నీఱొనర్పు॥
సీ॥ తిట్టులు కొండెముల్ వట్టిమాటలు కల్ల
లాడునోటివలన నబ్బుదోసఁగు,
కొట్టి కూడనివానిఁ బట్టియూరకచంపు
చేతివల్లను లభించెడుదోసంగు,
మెట్టుగాఁదగనిచో మెట్టి ప్రాణులహింస

గావించు కాలిచేఁ గలుగు దోసఁగు,
చెడుఁదలంపునఁగూడి చెడుపనుల్ చేయఁజా
చెడుమగగుటిచేతఁ బడయుదోసఁగు,
ప్రాణిబాధగావించెడి పాయువువల
నిదోసఁగనెడికర్మేంద్రియ నికరదురిత
మేమియేఁ ఈ రాత్రి చేసితి నేనిదాని
నిక్కముగ వగచిచ్చున నీఱొనర్చు॥

[పై మూడుపద్యములు చదువుటకు మొదలుపెట్టుటకు ముం
దాచమనమునకువలె నీళ్లుంచుకొని చివరకు వచ్చినప్పుడు మూడు
సారులు నీటిని ద్రాఁగవలయును. ఆఁడువారు రెండవపద్యమున
'పైయందగత్తైల' బదులు 'పైయందగాఱుల' అనియు మూడవప
ద్యమున 'మగ' బదులు 'ఆఁడు' అనియు వాడుకొనవలయును.]

చ॥ ప్రతినిమిషంబునందరయఁ బాపములెన్నియొ చేయుచుందు; ప
గతినవియెల్లఁ బాపుకొనఁ గల్గుదునో కరుణాసముద్ర! నీ
వతికరుణాప్రసన్నమతి నడ్డుగవచ్చిభయార్తు నన్ను వి
స్తుతముగఁ గావకున్నయెడ; తోఁచదు, కావవె నీక్రమొకెక్కడన్॥

క॥ తెలియకకొన్నియుఁ దెలిసియుఁ
దెలియకమఱికొన్ని, తేటతెల్లముగా నే
తెలిసి మఱికొన్ని పాపం
బులు సలిపెద నన్ను నెటుల బ్రోచెదవా హరీ!

గీ॥ నీదుకన్నుఁగప్పి నేనొనరింపఁగాఁ
గలుగుపాపమేమి గలుగు? కాన
నేనొనర్చినట్టి నిఖిలపాపంబులు
క్షమనుగావఁగదవె సర్వసాక్షి!

గీ॥ దేవదేవ!— అనుపద్యము మరలఁజదివి యాచమించి న
మస్కరించి

గీ॥ నినుఁదలఁచుచుఁ, బశ్చాత్తాపమున ననుభావ
నమగు నీనీరు చిలుకుట నాదుపాప
వహ్నిచల్లారినాకుఁ దాపంబుసేయ
కుండుఁగావుత నీదయ సోమహేశ!

[అనుచు నీళ్లు పైని జల్లుకొనవలయును. నీరు లేనిచో]

గీ॥ నినుఁదలఁచుచుఁ బశ్చాత్తాపమున ముసుంగు
కారణమున నన్నిప్పుడు గాల్చుపాప
వహ్నిచల్లారినాకుఁ దాపంబుచేయ
కుండుఁగావుతనీదయ సోమహేశ!

సీ॥ జగమంతయునుగూడ జంతుసంతతితోడ
నిండియుండునుగాన నేనుహింస
గావింపకుండుట కలుగదు; మఱియందుఁ
గర్మవశంబునఁ గలుగుదాని
నేనింతదప్పింప నేరనుగావున
దానికిఁజింతింపఁ నౌనె? కాని,
అటుగాక నావల్ల నగునన్నివిధముల
పాపంబులకుఁజాలఁ బరితపింతు;
ఇఁగమఱట్టివి చేయనంచాగివచింతు;
ఇంద్రియములలోఁబఱుపఁగా హెచ్చరింతు;
మనిచి తప్పులరక్షింపుమనితలంతు;
అఖిలలోకేశ! దీనజనార్తిహరణ!

గీ॥ ఇంక నే నెఱిఁగినవఱ కెట్టితప్పుఁ

జేఁతలుం జేయఁజేయను జేయఁజేయ;
బుద్ధివచ్చెను; ఇంతకుఁ బూర్వమున్న
పాపములరూపుమాపుము పాపహరణ!

సీ॥ తెలియని పనులచేఁ గలుగు దురితము ద
యంగావవేయంచు నడుగువాఁడ;
తెలిసి తెలియములఁ గలుగుపాపంబును
విసువకపోఁగొట్ట వేఁడువాఁడ;
తెలిసి తెచ్చుకొనిన బలు దోసఁగలుగక
మన్నింపుమని బతిమాలువాఁడ;
నాదగు బుద్ధిహీనతకు నన్నే నేను
నిందించికొని మదిఁగుందువాఁడ;
నేనొనర్చినతప్పుల కెదనుమిగుల
వగచివిడిచెదు కన్నీటి వాననాదు
కలుష పంకంబు నంతయుఁ గడిగి వేసి
నన్నుదయచేసి పోవు మాపన్న వరద!

గీ॥ నిన్ను ధ్యానించి, చేసిన యన్నిపాప
ములకు మానసమున నిజముగను వగచి,
వగపునిప్పునఁ బాపంబుఁ దగులఁబెట్టి,
శుచినియయి నీకుఁ గేల్మోడ్చి, స్తుతియొనర్తు॥

కృతజ్ఞతాపూర్వ కార్ఘ్యప్రదానము.

గీ॥ నామకష్టంబులకు వచ్చియాదుకొనుచు
నన్నుఁగాచు నీకుం దగినమటు మేలు
నొసరుపంజాల; కావున నుడుతభక్తి

యనునటుల యర్ఘ్యమిచ్చెదఁ గొనుము దేవ!
[నీరు లేనిచో నాల్గవపాదమునకు బదులు]
యనునటుల వందన మొనర్తుఁ గొనుము దేవ॥
(అని నమస్కరింపవలయు.)

సద్గుణప్రార్థన.

గీ॥ పాపములను, వానిఁ బ్రభవింపఁజేసెడు
పనుల, వానిఁజేయఁ బాలుపడెడు
నింద్రియములనణఁప నేవేఁడితినిగాన
నింక మంచిగుణము లీనడిగెద॥

సీ॥ అన్ని శుభంబుల కాకరంబగునీదు
పాదపద్మంబుల భక్తి నీవే;
కని పెంచి పెద్దగాఁ గావింప శ్రమపడు
తల్లిదండ్రులభక్తిఁ దగనొసఁగవే;
విద్య బుద్ధియునిచ్చి వెలయింపఁగలిగెడు
గురువులయెడభక్తిఁ గూర్పఁగదవే;
సర్వసద్గుణములు సమకూర్పఁజాలెడు
సజ్జనస్నేహంబుఁ జాలనిడవే;
పెద్దలహితోపదేశంబు విననొనర్చి
బాగుచేసెడియణఁకువ పాదుకొలుపు;
తనకునితరులకును మేలు నొనరుపఁగల
సత్యతననుగ్రహింపుము సత్యరూప!

సీ॥ కామాదిచోరులఁ గట్టిపెట్టంగల
శమమునొసంగవే శమనిధాన!

బాహ్యేంద్రియంబుల బంధింపనోపిన
దమము చేకూర్పవే దమనిశాంత!
మంచిచెడ్డలను గుర్తించునట్టుల చేయు
ధర్మంబునీయవే ధర్మమూర్తి!
పెనుచిక్కులొదవిన విధులను జేయించు
ధైర్యమునిడవె యోధైర్యభూష!
ఉన్నదానికిసంతోష మొందఁజేయు
తుష్టిసమకూర్పఁగదవె సంతుష్టిరూప!
అందఱిందనవలెఁజూడ నాచరించు
సర్వసమతప్రసాదింపు సర్వసముఁడ!

మ॥ దురహంకారముఁబాపువిద్య, ఇతరుల్ దుఃఖంబులంబొందుచో
సరిగాఁబంచుకొనంగఁజేయుకరుణన్, సత్కార్యముల్ చేయుచో
స్థిరతంగూర్చెడుస్థైర్యమున్, కుజను లుద్రేకించిబాధించుచోఁ
బరితాపంబునకోర్వఁజేయుక్షమ నాపట్లంబ్రసాదింపవే॥

చ॥ మనసును, మాట, కార్యమొకమాడ్కినెయుండనొనర్చు నార్జవం
బును, తనకున్నదార్తులకు మోదముతోనిడఁజేయుదానముం,
తనకడకెట్టిసాధులను దల్లడపెట్టక చేర్చుమార్దవం
బును దయచేయవేపరమపూరుష! సద్గుణభూష! ఈశ్వరా!

క॥ తనసుఖము లెక్కసేయక
యనవరతముఁబరుల మేలె యాపాదింపం
గనుఁగొనుపరోపకారము
మనమున వేరూనఁజేయుమా పరమాత్మా!

గీ॥ తనదుకీర్తి నెల్లప్పుడు మనుపఁజాలు

మహిమనొప్పారు దేశాభిమాన సుధను
నాదు డెందంపు బావి నిండఁగ నొనర్పు
మఖిలలోకాభిమాన! దయాసముద్ర!
గీ॥ నీదు చిత్త మెట్లున్నదో నే నెఱుంగఁ
గాని, స్వర్గంబు మోక్షంబుఁ గాంక్ష సేయు
టదియు స్వార్థపరత్వమే యగును గానఁ
బరుల కై యెప్పుడిటఁ బాటు పడ నెతలఁతు॥
గీ॥ ఇంక ముందెట్లు జరుగునో యెఱుఁగరాదు
గాని యీజన్మమున నైన నేను దలఁచు
చందమున జరుగఁదగిన సాధనంబు
లిమ్ము పరమాత్మ! నినుభక్తి నెంతు మదిని॥
గీ॥ దేవదేవ——అను పద్యము చదివి యాచమించి నమస్కరించి-
ఉ॥ ఱెక్కలు లేని జంతువులు జివ్వునఁ బైకెగురంగఁ జూచు నే
నొకరీటఁ గూల కెందయిన నుప్పరమందునఁ బోవఁ జాలు నే?
అక్కట! అల్లై మానవులు నాదియు నంతము లేని నిన్నుఁ దా
మెఱుఁగవగాఁ బ్రయత్నపడి యేనియుఁ జేరఁగఁ జాలరీశ్వరా!
సీ॥ ఎందుకీ లోకంబు నెల్లఁ బుట్టించి ర
క్షించి త్రుంచి మరల్తొ చెప్పరాదు;
ఎందుకీ వంతట నెసఁగుచునుండియు
నేరికిఁ గనరావొ యెఱుఁగరాదు;
ఎందుకు మనుజు లనేక భంగులఁ బోవ
మిన్నకయుండెదో యెన్నరాదు;
ఎందుకు నరులకు ముందువెన్కల స్థితి
గనుశక్తి యీయవో కానరాదు;

ఎంతుకీ మొఱ్ఱ? నీలీల లెల్లు తెలియు?
చపలమగు మది యిటునటుఁ జనుచునుండు,
దానిబంధించి చేర్పు నీ ధ్యానమార్గ
మందు, సర్వేశ! నినుఁగొల్తు డెందమందు॥

ప్రార్థనారూపజపము.

క॥ దేవా! నిను వేఁడెదనీ
సేవకునకు విద్య బుద్ధి చేకూరిచి, వీ
లౌవఱ కితరులకున్ మే
ల్గావించి తరించునటుల కరుణింపఁగదే॥

[ఇది పదిసారులకుఁ దక్కువగాకుండ, వీలుకొలఁది నెక్కువ గా నేకాగ్రబుద్ధితో జపింపవలయును. పలుమాటలేల? జ్ఞానాభివృద్ధి నొందించునదగుటచే విద్యయును, ఆవిద్యవలనఁ గలుగు జ్ఞానమును సరిగా వాడునటుల చేయించునదగుటచే బుద్ధియును, ఆ విద్యాబుద్ధులవలనఁ దేలునది- జన్మమెత్తినందులకు ఫలము పరులకు నుపకారము చేయుటయే- యగుటచే వీలగునంతవఱకుఁ బరులకు మేలుచేయుశక్తియుమాత్రము కోరఁదగినవి; కావునఁ దమవిధి నెఱిఁగినవారికి నెప్పుడు నిదియే జపమైయుండు. కాన మానవులందఱు నిదియే యెప్పుడు తమజపముగాఁ జేసికొని, దైవానుగ్రహమునొంది తమజన్మములు సఫలములుగాఁ జేసికొందురుగాక.]

నడిమివందనము.

ఉ॥ ఎల్లెడనిండియుండియును నేరును నీ కలరూపెఱుంగఁగాఁ
జెల్లనిరీతినొప్పెదు విచిత్రచరిత్ర! ఇనాదిగోళముల్
పెల్లుగనాకసంబునను వింతగఁబట్టాక యింతలేక రా

జెల్లిచరించి వచ్చునెడ సేగినిబొందక నైజమార్గముల్
డుల్లకయుండఁజూచుచుఁ గడుం వెలుఁగొఁగతి నార్చుచుండునో
సల్లలితప్రభావ! కనఁ జక్కఁగ లెక్కిడ వీలొసంగకే
వల్లను సూది మోపుటకుఁ బాల్పడనీయని యట్లు తా నెఱ్ఱై
కొల్లగనుండు జంతుతతిఁ గోరిక నే సృజియించి పెంచుచుం
జల్లఁగఁ బెళ్లునందు నిమి సాఁగఁగనంపుచు, మళ్లియట్టు లే
యుల్లసిలంగఁ జేయఁగ, అహాహా! యివి చచ్చి జనించినట్టివా?
చెల్లదుః క్రొత్తవా? యిదియుఁ జెల్లదటంచనుకొంచు నెందఱో
యుల్లమునందుఁ బెక్కులగు నూహలు చేసియు సిద్ధనిక్కమౌ
కల్లయిదంచుఁ దేల్చునవకాశ మొసంగక చూడఁజూడఁగాఁ
బల్లుగఁదోఁచి తెల్వికను పాఱక చీఁకటికమ్మ, డెందముల్
తల్లడమందఁగా నహహా! దైవమ! నీమహిమంబగమ్యమౌ;
మెల్లఁగఁగొల్చుకొంటెనిఁక మేమొనరించునదేమి యంచెదం
జల్లఁగ నిన్నె నమ్మి తమ శక్తి కొలంది నిమంచిత్రోవనే
వెళ్లి పరోపకారమునె పెద్దగఁ జూచుచుఁ దోడు సూపుచున్
వెల్లువబుగ్గప్రాణమిది పెంపలు నెప్పుడొ యంచుఁగాలమున్
వెళ్లఁగఁబుచ్చునట్లొనరుపింపఁగజాలు నగమ్యశక్తి! నా
వల్లను గల్గులోపములఁ బాపి కృతార్థునిఁ జేయు మ్రొక్కెదన్‼

ఋషీశ్వరాది వందనము.

క॥ కనరాని నిన్నుఁ గనుఁగొనఁ
జను తెలివిని దనరు మౌనిచంద్రులకు, ననుం
గని పెంచి బుద్ధి యిడు గురు
జనములకును మ్రొక్కులిడెద జగదాధారా!

సీ॥ పరమేశుఁ గనుఁగొన్న ప్రార్థినొప్పిన ముని
వరులార! మీకిదే వందనంబు;
నను గని పోషింప ఘనతర కష్టముల్
పొందిన పితలార! వందనంబు;
విద్య బుద్ధియుఁ జెప్పి వెలయింపఁ బలుపాట్లు
పడినట్టి గురులార! వందనంబు;
కష్టకాలమున వార్ధన సహాయములీయ
వచ్చు సజ్జనులార! వందనంబు;
కోరకూరక యే మేలు కూర్పఁ జూచు
భవ్యగుణులార! మీకిదే వందనంబు;
చెడి చెడుట కూడదంచు నెప్పుడును జాటి
కుంచు నరులార! మీకును వందనంబు॥

ఫలప్రార్థనము.

సీ॥ అన్యుల మేలుకై యత్నించు సజ్జనుల్
తుదిలేని సౌఖ్య మొందెదరుగాక!
నేను మనన్ హేతువైన నాపితరులు
తుదిలేని సౌఖ్య మొందెదరు గాక!
నా తెలివికిఁ గారణంబైన నాగురుల్
తుదిలేని సౌఖ్య మొందెదరు గాక!
నాకుఁదోడగుచుండు నామిత్రులందఱుఁ
దుదిలేని సౌఖ్య మొందెదరు గాక!
పాపులే నెల్లరుఁ బాపంబు నెడఁబాసి
తుదిలేని సౌఖ్య మొందెదరు గాక!

మానవులుగాక మిగిలిన హీనజంతు
బృందము ననంతమగు సౌఖ్యమొందుఁగాక!
పనుసీయాన నడుచుచు నితరుల కుప
కృతియొనర్చుచు నుండి తరింతుగాక!

తుదివందనము.

సీ॥ అఖిల లోకంబుల కాధారమగునట్టి
పరమేశ! నీకిదే వందనంబు;
అఖిల ప్రపంచంబునందు నిండి వెలుంగు
పరమాత్మ! నీకిదే వందనంబు;
బ్రహ్మాండమంతయుఁ బాలించు చుండెడి
పరశక్తి నీకిదే వందనంబు;
అంతయుఁ జేయుచే వంత లేకుండు నా
నందాత్మ! నీకిదే వందనంబు;
మనుజనికరముఁ బశుచయమును ఖగోత్క
రమును జలచరముఖ జంతుసముదయంబు
స్థావరగణంబుఁ గ్రమముగాఁ జరుపు నో ప్ర
పంచభర్తా! యిదే నీకు వందనంబు॥

మార్గప్రదర్శనప్రార్థన.

గీ॥ ఇఁక శరీరయాత్ర కేగెడు వాఁడను,
తప్పుఁదోవఁబట్టి తల్లడిలక
మంచిదారిఁ జేరి మనసార సుఖపడు
పగిదిఁ జూడఁగదవె భక్తపాల!

మధ్యాహ్నసంధ్యావందనము.

ప్రాతస్సంధ్యావందనమునఁ గాలమును దెలుపు పదములను మార్చిన నదియే మధ్యాహ్నసంధ్యావందనమునగు.

మార్పులు.

దీక్షయందు— 'ప్రాద్దుటి' బదులు 'మధ్యాహ్న'.

పశ్చాత్తాపమున— 'మేమియేన్ రాత్రిచేసితి' బదులు 'మేనుబ్రొద్దుటఁజేసితి'.

కొందఱికి మధ్యాహ్న సంధ్యావందన మంతయు సరిగాఁ జేయుటకు వీలుండదు. అట్టివారు తమకు వీలగునంతవఱకు మనస్సునఁ జేసికొనుట మంచిది. అందులోఁ బశ్చాత్తాపమును, జపమును ముఖ్యములు.

సాయం సంధ్యావందనము.

ప్రాతస్సంధ్యావందనమునఁ గాలమును దెలుపు పదములను మార్చిన నదియే సాయం సంధ్యావందనమునగు.

మార్పులు.

దీక్షయందు— 'ప్రొద్దుటి' బదులు 'మాపటి'.

పశ్చాత్తాపమున— 'రాత్రి' బదులు 'పగల్'.

ఈసాయంసంధ్యావందనము కూడఁ బ్రాతస్సంధ్యావందనంబువలెనె యందఱుఁదప్పక చేయవలయును. మధ్యాహ్నసంధ్యావందనము సరిగాఁ జేయుటకు వీలులేనివారెక్కువ జాగరూకతతోఁ జేయవలసియుండు.

పండుకొనఁబోవునప్పటివందనము.

గీ॥ నేఁటికి శరీరయాత్రను నేముగించి
నాఁడ నయినను ధ్యానిలో నాకుఁదెలిసి
నవియొ కొన్నియుఁ దెలియని యవియుఁగొన్ని
పాపములు చేసియుందుఁ గాపాడుదేవ!

క॥ కదలక మనస్సు చేతను
గదలుచు మఱివాక్కుచేతఁ గాయముచేతం
దుదిలేని దోసఁగు లొాదవును
సదయత ననుఁ బ్రోవఁగదవె సదమలరూపా!

గీ॥ అకట! నేఁడు నేఁజేసిన యట్టిపాప
మునుదొలఁప సంధ్యలందు వందనముచేసి
యున్న నపుడైన నామది తిన్నఁగా నె
యున్నదనఁజాల నెటుగాఁతొ యెన్నఁజాల॥

గీ॥ పనుమంచిగనడువనే యెంతొయత్న
మాచరించుచునుండిన నడ్డువచ్చి
తప్పుదారులఁబట్టించి తల్లడిల్లఁ
జేయు మదిదొంగ నేనేమి చేయువాఁడ?

గీ॥ ఇంటిదొంగనుబట్టఁగా నీశ్వరునకు
నైనశక్యమె యనుమాట నతిశయించె
నీమనసుదొంగచర్యః హా! యెఱఁగి యెఱఁగి
పట్టఁజాలఁ; ఇఁకేగతి? పరమపురుష!

క॥ ఒకవేళఁ బట్టుపడినను
సుకరముగాఁ దప్పిపోయి చోద్యముగానొం

డొకనిమిషంబున నెప్పటి
రకమునఁగలఁచుం బరాత్పరా! యేమందున్॥

గీ॥ పట్టువడియొక్క వేళను గట్టఁబడినఁ
గట్టుకట్లుగనుండనే యెట్లొజాఱి
నొక్కఁబడి విడివడుగాలిఫక్కి ముందు
కంటఁజెలరేఁగిబాధింపఁ గడఁగుదేవ!

సీ॥ తక్కెడలోనుంప దానిలోనుండక
తప్పించుకొనిదాఁటు కప్పవోలె,
పట్టి బుట్టంబెట్ట మట్టుగానుండక
మిడిసిపడుచునుండు మీనువోలె,
కట్టిపెట్టినత్రాళ్లు కఱకుపండ్లంబట్టి
కొఱికిఁ బ్రైసుఱికెడు కుక్కవోలె,
వలఁజిక్కియునుదాని నలిగాఁగరాపాడి
పాఱిపోవునడవి పందివోలె,
నేను నిలిపినస్థలమున నిలువక యిటు
నటుఁ దొలఁగిపోయి ననుఁజాల నలఁచుచున్న
మనసుతోఁబోరు నామీఁదఁ గనికరించి
తోడుపడిదానిలోఁబర్పు, వేఁడుకొనెద॥

గీ॥ మనసు లోఁబడకున్న నేపనియుఁగాని
సరిగఁగాఁ జాల దందుచే సర్వశక్తి!
దాని లోఁబర్చుకొనుటకుఁ దగినశక్తి
యిమ్ము దానితోనె నిను ధ్యానమ్మొనర్తు॥

గీ॥ దొంగలకు స్థానమామది దొరకెనేని
దొంగలగు కామముఖ్యులు దొరకఁగలరు;

అటులయింద్రియ చయము లోనయ్యె నేని
గెలువరానిది యెయ్యది గలుగు? దేవ!
గీ॥ ఇంతకిట్టి చిక్కులకెల్ల హేతువైన
మనసునడ్డుగ నెందుల కునిచితనుట
తప్పు; అది లేనిచో నేముందగుదుమనుచుం
జేయునదియేమి? నీమది చెలంగు టెట్లు?
గీ॥ నీయెడల లోపమెంచుట నిప్పులోన
ముటికియున్నది యనుట యోపుణ్యమూర్తి!
గానవీయందు దోషంబు గలుగదింత;
ఉన్నదంతయు నాయందె యుండుంగాని॥
గీ॥ ఇంతకేం జేసినట్టి మేలేమి? సున్న;
చెడ్డయో? అంతయునదె; నీ చిత్తమింక,
నన్ను నెట్టులకాపాడ నెన్నినావో?
దిక్కు నీవే యటంచు నే మొ్రక్కువాండ॥
సీ॥ ఎన్నండు నేను నాయెదను గెల్చితినంచు
నానంద సుధం దేలియాడం గలనో?
ఎన్నండు నేను నాయింద్రియమున దేనం
బాపము లేదని పలుకం గలనో?
ఎన్నండు నేను నాయిచ్చ వచ్చినరీతి
నిన్నుం గొల్చితినంచు నెన్నంగలనో?
ఎన్నండు నేను నాకితవగు తెఱంగున
మంచి చేసితినంచు నెంచంగలనో?
ఎన్నండు నేను నాయెత్తినజన్మంబు
సార్థకమయ్యె నంచనంగంగలనో?

ఎన్నఁడిఁక నేను జచ్చిన నేమిభయము
    పొమ్మనుచు ధైర్యమునఁ గన్నుమూయఁగలనో?
అట్టి సుదినము సాధ్యమౌ నంతత్వరగ
    నాకొసఁగు నిన్నుఁగొల్తు నానందరూప!

గీ॥ అట్టి భాగ్య మిప్పటికి నాకమరలేదు
గాన నినునమ్మియే యిప్డు కన్నుమూసి
నిత్యమరణంబు నొందెద నిత్యరూప!
మనిచి నన్ను నీసేవకు మరలఁ దెమ్ము॥

[అని ప్రార్థించి పరాత్పరుఁ దలంచుచు నిద్రింపవలయు. ఆఁడువారు 'వాఁడ' అని వచ్చినచోట 'దాన' అని వాడుకొనవలయు.]

భోజనమునకుముందు చేయవలసిన ప్రార్థన.

గీ॥ దేవదేవ! నేనిప్పుడు తినఁదలఁచెడి
యీపదార్థములవలన నెసఁగు బలము
నాకుఁ బరులకు దేశంబునకును మేలు
చేయుపనులకె పనికిరాఁ జేయఁగదవె॥

[అని పరాత్పరుఁ బ్రార్థించి, తాము తినఁదలఁచిన పదార్థముల నీశ్వరునకర్పించి, వానివలనఁ దమకుఁ గలుగు బలము మంచిపనులయందే కాని చెడుపనులయందు నుపయోగింపమని నిశ్చయమొనర్చుకొని తినవలయును. శరీరము మనవిధి చేయుటకు ముఖ్యసాధనమగుట చేతను, ఆశరీర మాహారములేక పనిచేయఁ జాలకపోవుటచేతను, కోటివిద్యలును గూటికొఱకను సామెతరీతిని మనము మొదటఁ బ్రతుకుఁదెరువు జూచుకొనవలసియుండు. అయినను

మనబ్రతుకంతయుఁ దిండికొఱకే యనుకొనఁదగునా? తగదు. మనము మనుష్యజన్మమెత్తినఫలము- విద్యాబుద్ధులు నేర్చుకొని బాగుపడి న్యాయమార్గమున నడుచుచు మంచివారనిపించుకొని, వీలగునంతవఱకు నితరులకు నుపకారముచేయుచు, దేశాభివృద్ధికిఁ బాటుపడుచుండుటకాని, లేచినది మొదలు పండుకొనఁబోవువఱకుఁ దిండికొఱకును, అదియైనతరువాత నెండమావులవంటి శరీరసంబంధములగు తుచ్ఛసుఖములకొఱకును జూచుకొనుట కాదు. కాఁబట్టి తిండివలనఁ గలుగవలసిన ఫలము శరీర పోషణమును, దానితరువాత మనజన్మమును సార్థకముచేసి మనపేరు శాశ్వతముగానుండునట్లు చేయఁగల పరోపకార దేశాభివృద్ధులకొఱకుఁ బాటుపడుటయునేకాని, తుచ్ఛసుఖములకొఱకుఁగాలముపాడుచేసి జన్మము వ్యర్థము చేసికొనుట కాకపోవుటచే మనము శరీరమునకు బలమిచ్చు వస్తువులు మాత్రమె కొనవలయునుగాని మత్తుచేసి కామక్రోధాదులఁబెంచువస్తువుల నెంతమాత్రము గొనఁగూడదు. ఈసంగతినెఱింగి మనుష్యులందఱు శరీరపోషణమునకుఁదగిన మంచిపదార్థములనేపుచ్చుకొని, వానివలనఁ గలుగుబలము తమకును, పైవారికిని, దేశమునకు మేలుచేయుపనులయందే యుపయోగపఱిచి, తమజన్మమునఫలముచేసికొని, తమపేరు స్థిరముగానిలుపుకొందురుగాక.]

గీ॥ దేవదేవుఁ డిచ్చుకొలఁది తెలివిఁబట్టి
తోడివారల కొకయింత తోడ్పడునను
నాస నీచిన్నిపొత్తంబు వ్రాసెఁగడఁక
సకలహితమతి,

మా॥ రామచంద్రశాస్త్రి.

తెలుఁగుసంధ్యావందనము.

అర్థములు.

సంధ్యావందనము=సంధ్యాకాలములయందు మేలుగోరి పరాత్పరుని గూర్చి చేయువందనము. సాధారణముగా సంధ్యలుమూడు:— ౧ ప్రాతస్సంధ్య=రాత్రియుఁ బగలును గలియుకాలము. ౨ మధ్యాహ్నసంధ్య=పూర్వాహ్ణమును, అపరాహ్ణమును గలియుకాలము. 3 సాయంసంధ్య=పగలును రాత్రియుఁ గలియుకాలము. ఇందు జాగ్రత్సుషుప్త్యవస్థల సంధ్యలును గలుపఁబడినవి. జాగ్రత్తు=మేలుకొనియుండుట. సుషుప్తి=నిద్ర.

శరీరయాత్ర=శరీరమును బోషించుకొనుటకుఁ జేయుపని.

దురితము=పాపము=చెడుపని.

2

ప్రతిజ్ఞ=తప్పక చేయుదుమని నిర్ణయించుకొనుట.

హరి=అన్నిపాపములను బోఁగొట్టువాని.

ఆచరించి=చేసి.

నారాయణ=జ్ఞానమునకు స్థానమగువాఁడ.

వాసుదేవ=అంతటనుండి ప్రకాశించువాఁడ.

అధోక్షజా=ఇంద్రియముల జయించినవాఁడ.

అచ్యుతా=నాశనములేనివాఁడా.

సర్వశక్తి=అన్నిశక్తులుగలవాఁడ.

సమాయించి=నశింపఁజేసి.

సర్వాంతరగతి=అన్నిటిలో నుండువాఁడు.
సర్వసాక్షి=అన్నియుఁజూచువాఁడు.
నిఖిలరూప=అన్నిరూపములు నీవెయగువాఁడు.

3

సర్వజ్ఞ=అన్నియుఁ దెలిసినవాఁడు.
అనువీని=వీలుకలుగఁజేయని.
నిర్వికార=మార్పు లేనివాఁడు.
అభిమతము=కోరిక.
తత్వము=నిజమగుస్థితి.
ఇంద్రియనిరాకరణము=ఇంద్రియములఁ దిరస్కరించుట. (ఇంద్రియములలోఁబలుచుకొనుట.) ఇంద్రియములు ౧౧-౧ మనస్సు. (ఇదియే లోపలియింద్రియము.) ౨ కన్ను ౩ ముక్కు ౪ చెవి ౫ నాలుక ౬ చర్మము- ఈయైదు జ్ఞానేంద్రియములు. ౭ నోరు ౮ చేయి ౯ కాలు ౧౦ మూడి (మనముతిను పదార్థమున సారముపోఁగా మిగిలినపిప్పిని బైకివిడుచునింద్రియము.) ౧౧ మగగుఱి — ఆఁడుగుఱి. (నీరుడువిడిచి, పుట్టువుకలిగించు నింద్రియము.)- ఈయైదుకర్మేంద్రియములు.
సారథి=బండితోలువాఁడు.

4

దీక్ష=నియమముచేసికొనుట.
పాపమార్జనము=పాపమును మడిచివేయుట.
పశ్చాత్తాపము=మనముచేసిన తప్పులు తెలిసినతరువాత వాని వలనఁగలుగుకీడు తెలిసికొని, అవి చేసినందులకు దుఃఖించి, అట్టివి మఱియెప్పుడును చేయమని నియమముచేసికొని యానియమప్రకారము నడుచుట.

5

కామము=కోరరానికోరికలఁ గోరునటుల చేయుదుర్గుణము.
క్రోధము=పైవారిమనస్సులనొప్పించునటుల చేయుదుర్గుణము.
లోభము=పైవారికి సహాయము చేయకుండునటుల చేయు దుర్గుణము.
మోహము=వస్తువుల యథార్థస్థితి తెలియకుండఁ జేయు దుర్గుణము.

6

మదము=పైవారికిఁ గీడుకూడఁ జేయించు దుర్గుణము.
మచ్చరము=పైవారుసుఖపడుటకోర్వనటుల చేయుదుర్గుణము.
మానసికము=మనస్సుసంబంధమైనది. (మనస్సుచేఁ జేసినది.)
వగచిచ్చున=విచారమనునగ్ని చేత.
నీఱు=భస్మము.
వీనులు=చెవులు.
త్వక్కు=చర్మము.
దోసఁగు=పాపము.

7

అతికరుణా ప్రసన్నమతిన్=మిక్కిలి దయచే స్వచ్ఛమగు మనస్సుచేత.
భయార్తు=భయముచే దుఃఖించువాఁడనగు.
విస్తుతముగ=మిగులఁగొనియాడఁదగినటుల.
క్షమను=ఓర్పుతో.

8

పాపవహ్ని=పాపమనునిప్పు.
తాపము=బాధ.

కర్మవశంబునన్ = కర్మముచేత.

కర్మము = ముందు చేసికొనిన మంచి చెడు పనులఫలము.

పరితపింతున్ = మిక్కిలి దుఃఖించెదను.

అఖిలలోకేశ = సమస్తలోకములకుఁ బ్రభువా.

దీనజనార్తిహరణ = భయపడువారి దుఃఖమును బోఁగొట్టువాఁడ.

9

కుందు = దుఃఖించు.

ఎదను = మనస్సున.

కలుషపంకంబుగ = పాపమనుబురదను.

ఆపన్నవరద = దుఃఖమునొందినవారి కోరికలిచ్చువాఁడ.

కృతజ్ఞతాపూర్వ కార్ఘ్యప్రదానము = చేసిన మేలు మఱవకుండుటను దెలుపుచుఁ బరమేశ్వరునకుఁ బ్రీతిగానీరిచ్చుట.

ఆదుకొనుచున్ = సహాయపడుచు.

10

సద్గుణప్రార్థన = మంచిగుణములకొఱకు వేఁడుకొనుట.

ప్రభవింపఁజేసెడు = పుట్టునటుల చేయునట్టి.

ఆకరంబు = స్థానము.

హితోపదేశము = మొదట నింపుగాకున్నను తరువాత మేలు చేయుబోధ.

పాదుకొలుపు = స్థిరపడునటుల చేయుము.

శమము = కామము మొదలగు దుర్గుణముల నణఁచు మంచి గుణము.

శమనిధాన = శమమునకు స్థానమగువాఁడ.

11

బాహ్యేంద్రియములు=పైయింద్రియములు. (జ్ఞానేంద్రియకర్మేంద్రియములు.)

దమము=బాహ్యేంద్రియముల నణఁచు మంచిగుణము.

దమనిశాంత=దమమునకు స్థానమగు వాఁడ.

తుష్టి=తనివి.

స్థిరత=స్థిరత్వము=నిలకడ.

ఉద్రేకించి=అతిశయించి.

ఆర్జవము=తిన్నఁదనము.

ఆర్తులకున్=దుఃఖపడువారికి.

మార్దవము=మృదుత్వము=మెత్తఁదనము.

ఆపాదింపన్=కలిగింప.

మనుపఁజాలు=రక్షింపఁగలయట్టి.

12

దేశాభిమానసుధను=దేశముమీఁదిప్రేమయనునమృతముతో.

డెందంపుబావి=మనస్సనునూయి.

స్వార్థపరత్వము=తనమేలునందలి యాసక్తి.

ఉప్పరము=ఆకాశము.

13

ఏరును=ఎవరును.

ఇనాదిగోళముల్=సూర్యచంద్రాదిమండలములు.

పెల్లుగ=అధికముగ.

14

సేగిని=కీడును.

డుల్లక=తప్పిపోక.

వెఱఁగొఁగతిన్=వింతయగురీతిని.

పల్లు=గోయి.
అగమ్యము= తెలిసికొనరానిది.
వెల్లువబుగ్గ=ప్రవాహముమీఁది నీటిబుడగ.
జగదాధార=లోకమున కాధారమగువాఁడ.

15

ప్రౌఢి=నేర్పు.
పితలార=తల్లిదండ్రులార.
మనఁగ=బ్రతుకుటకు.

16

బృందము=సమూహము.
ఉపకృతి=ఉపకారము.
తరింతుఁగాక=కృతార్థుఁడనగుదునుగాక.
వంత=విచారము.
నికరము=సమూహము.
చయమును=సమూహమును.
ఖగోత్కరమును=పక్షులసమూహమును.
జలచరముఖ జంతుసముదయంబున్=నీటి జంతువులు మొదల
గు జంతువులసమూహమును.
స్థావర=ఒకచోటనేకదలకుండు వస్తువుల.
మార్గప్రదర్శనప్రార్థన=మంచిదారిఁజూపవేఁడుకొనుట.

18

కాయము=శరీరము.
తొలఁపన్=తొలగించుటకు.
తలడిల్లఁజేయుఁగ=భయపడునట్లుచేయును.
మదిదొంగ=మనస్సునుదొంగ.
సుకరముగా=సులభముగా.

19

ఒండొక = మఱియొక.

కలఁచున్ = బాధపెట్టును.

ఫక్కిన్ = రీతిని.

కడఁగున్ = ప్రయత్నించును.

మీను = చేఁప.

అలఁచుచున్న = బాధించుచున్న.

కామముఖ్యులు = కాముఁడు మొదలగువారు.

20

చెలఁగుట = సంతోషించుట.

ఎదను = మనస్సును.

దేనన్ = దేనిచేతను.

ఇతవు = హితము = మేలుచేయునది.

సార్థకము = సఫలము.

21

అమరలేదు = కలుగలేదు.

నిత్యమరణము = నిద్ర.

నిత్యరూప = శాశ్వతమగు రూపముకలవాఁడు.

మనిచి = కాపాడి.